honeybee.org
Vol-6 Issue-3

సంపుటి 6 సంచిక 3 మార్చి - ఏప్రిల్ 2018

# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక



# ఆడుకోవటానికి దెయ్యం ఉంటుందా?



పిల్లల్లో కొత్తదనాన్ని తెలుసుకోవాలనే ఉత్సుకత ఎక్కువ. మనం చూసే ప్రపంచాన్ని, వాళ్ళు చూసే విధానం మన సృజనాత్మకతపై ప్రభావం చూపుతుంది. పెరుగుతున్నకొద్దీ మనలోని పసివాడు ప్రశ్నలడగడం మానేస్తాడు. నిజం చెప్పాలంటే మనలో పిల్లవాడు మనకన్నా త్వరగా ఎదుగుతాడేమో!

ఒక చిన్న అమ్మాయి ఎప్పుడూ చాలా ఉల్లాసంగా ఆడుతూ, పాడుతూ హుషారుగా ఉండేది. ఆ అమ్మాయి ఆడుకుంటూ ఉండగా ఒకసారి దేవతలు ఆమెని చూసి, తనతో మాట్లాడాలనుకుని వారంతా ఆమె దగ్గరకొచ్చారు. తన ఆటలో పడ్డ ఆ అమ్మాయి వారిని గమనించలేదు. అప్పుడు వాళ్ళు ఆ పాపతో నువ్వు ఆడుకుంటూ ఉండగా దేవుడు చూశాడట, నువ్వు చాలా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటావు కనుక నువ్వు మాతో స్వర్గానికొస్తావా? అని అడిగారు. దానికా పాప కొంతసేపు ఆలోచించి, మరి నాతో అక్కడ ఆడుకోవటానికి దయ్యం ఉంటుందా? అని అడిగింది.

ఈ రకమైన చిలిపితనం మనం పెద్దవాళ్ళమయ్యేకొద్దీ మనలో తగ్గిపోతుంటుంది. మేము (పల్లెసృజన) ఎంతోమంది చిన్న పిల్లలని చూశాము. వాళ్ళలోని సృజనాత్మకత మమ్మల్ని ఆశ్చర్యచకితుల్ని చేసింది. మీకూ ఇటువంటి అనుభవాలుంటే అటువంటి పిల్లలను గురించి మాకు వ్రాయండి. ఎందుకంటే మన పెద్దవాళ్ళలోకన్నా, పిల్లల్లో ఆలోచనలు, సృజనాత్మకత ఎక్కువ. అవునా? – హనీబీ 16(3)–2005

# పల్లెసృజన

సంపుటి-6 సంచిక - 3 మార్చి-ఏప్రిల్ 2018



పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit at :www.pallesrujana.org



**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం,**

సంపాదకులు :
**జమ్ములమడక శశిమోహన్,**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త,**
**పి. చంద్రకాంత్ శర్మ,**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్,**
**జమ్ములమడక శ్రీకర్,**

కార్టూన్స్ : **వెంకట్**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail :
narendragrafixhyd@gmail.com


**Rs. 800/-**
**for 5 years Subscription**

## ఈ సంచికలో...


3 సివిఆర్ సుస్థిర హరిత వ్యవసాయ పద్ధతి







18 9వ జాతీయ ద్వైవార్షిక పోటీలు బహుమతి పొందిన ఇన్నోవేషన్లు





7 అమ్మకానికి సిద్ధంగా ఉన్న గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

23 నన్నం తిరుపతి 'కరెంటు స్తంభాలనెక్కే చెప్పులు'







27 రైతుల కొరకు రైతులు అభివృద్ధి చేసిన విత్తనాలు

గృహిణులకు అవసరమైరన రసాయనాలు లేని శుభ్రపరిచే ద్రావణాలు 11





30 ఆయుర్వేదం జ్ఞాన మథనం 'త్రికటకాలు'తో వైద్య చిట్కాలు









15 మీ ప్రాంతంలో ఇన్నోవేషన్లు ప్రదర్శించాలా?

కవర్ లోపలి పేజీల్లో ... **ఆడుకోవటానికి దెయ్యం ఉంటుందా?** హనీబీ కథ, అమ్మకానికి సిద్ధంగా వున్న 'గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్'

మధ్య పేజీలో : **'పల్లెసృజన' పాల్గొన్న ప్రదర్శనలు**



Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix,** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**



## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Num Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# ఆరోగ్యానికి ప్రాధాన్యత ఎప్పుడు?

'ఆరోగ్యమే మహాభాగ్యం' అన్న నానుడిలో ఎంతో అర్థం, పరమార్థం ఉంది. మనిషి ఆనందానికి ఆరోగ్యం మూలం, సమర్థతకు ఆరోగ్యం మూలం. మంచి ఆలోచనకు, క్రియాశీల కార్యాలకు కూడా ఆరోగ్యం మూలం. సమాజంలో అనవసర ఖర్చులు, వసతులు, వాడుతున్న వనరులు.... ఇవన్నీ తగ్గాలంటే ప్రజల ఆరోగ్యం బాగుండాలి. సమాజంలో, దేశంలో, ప్రపంచంలో ఏవరైనా సరే ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే కష్టాలు, నష్టాలు తప్ప అభివృద్ధి, సమృద్ధి, ఆనందం అనేవి సాధ్యం కావు.

మనిషి ఆరోగ్యం అంటే వైద్యులు, మందులే కాదు. ఆహారం, వ్యవహారం, సంస్కారం... ఇవన్నీ ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. తన ఆరోగ్యానికి బాధ్యుడు మనిషే తప్ప వైద్యుడు కాదు, మందులు కావు అని గుర్తించాలి. కాని ప్రస్తుతం అందరూ తమ ఆరోగ్యాన్ని వైద్యుల చేతుల్లో పెడుతున్నారు అంటే తమ ఆరోగ్యాన్ని 'ఔట్‌సోర్స్' చేస్తున్నారు. ఇదెంతో ప్రమాదకరమైన పద్ధతి. 'ఆహారం' అంటే ఆహారపు అలవాట్లు, తినేసమయాలు, ఉపవాసాలు, నడత, స్నాన పానాదులు, శుభ్రత, మితాహారం.... వగైరాలు. 'వ్యవహారం' అంటే ఉద్యోగం లేదా వ్యాపార రీత్యా తమ దైనందిన కార్యక్రమాలు, పాటించే నీతి, సవ్యమైన పద్ధతులు మొదలైనవి. ఇకపోతే 'సంస్కారం' జీవన శైలిని నిర్ధారిస్తుంది. ఇందులో స్వార్థాలు, అత్యాశలు, అసూయలు, సమాజంపై నిర్దయ, ఎదుటి మనిషిని గౌరవించకపోవడం, పదవి, ధన, కుల, మత అహంకారాలు, వయస్సుతో వచ్చే దురహంకారం.... ఉంటాయి, ఇవన్నీ ఆరోగ్యానికి హాని చేసేవే. క్షణికానందం, స్వల్పకాల లాభాలకై మనకు అత్యంత ప్రధానమైన ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టడం సబబు కాదు.

'ఆహారం' అన్నది మనకి ఆరోగ్యంలో అతి ప్రధానమైన అంశం. ఏమి తింటున్నాం, ఎప్పుడు తింటున్నాం, ఎంత తింటున్నాం, ఎక్కడ తింటున్నాం, ఎందుకు తింటున్నాం అన్న ప్రశ్నలు మనకు కావలసిన ఆహారాన్ని నిర్ణయించుకోవడానికి చాలా తోడ్పడతాయి. మన సాంప్రదాయ జ్ఞానంలో ప్రకృతిలో లభించే ఎన్నో ఆకులు, కాయలు, పండ్లు, నెయ్యి, పాలు, పెరుగు, మితంగా తీపి పదార్థాలు, కాలానుగుణమైన కూరలు... ఇవన్నీ ఆహారంలో భాగంగా ఉంటాయి. పూర్వం వాతావరణం, రుతువులు, కాలాలకు అనుగుణంగా అమ్మమ్మ, నానమ్మలు భోజనానికి కావలసిన పదార్థాలను సేకరించి వంట చేసి అందరికీ భోజనాలు వడ్డించేవారు. ముడి సరుకులు పండించడం గాని, కొనుక్కోవడం కాని చేసేవారు. వీటిని ఉపయోగించి, వంట నూనెలు, మసాలాలు, పచ్చళ్ళు వగైరా ఇంట్లోనే తయారు చేసుకునేవారు. దీనివల్ల ఆరోగ్యకరమైన పదార్థాలు వంటల్లో వాడటానికి లభించేవి. అంతేకాకుండా మహిళలకు ఈ పనుల వల్ల ఒక రకమైన వ్యాయామం కలిగి ఆరోగ్యం చేకూరేది. ఆరోగ్యంకోసం ప్రత్యేకంగా వ్యాయామం చేయకుండా, దినచర్యలో భాగంగా పనులు చేస్తే రెండు రకాల లాభాలు చేకూరుతాయి. ప్రస్తుత జీవనశైలి ఇలాంటి అద్భుత, సరియైన ఆహార వ్యవహారాలకు పూర్తిగా వ్యతిరేకం. మరి అలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యం ఎలా సరిగా ఉంటుంది?

వైద్యం సరియైన ఆరోగ్య సాధనలో ఒక ప్రధాన భాగం. మనదేశంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి మనిషి - వైద్యుడు సమిష్టి బాధ్యతగా కలిసి కృషి చేసేవారు. కానీ, ఈరోజుల్లో పైన చెప్పినట్లు ఆరోగ్యం అన్నది డాక్టర్ల బాధ్యతగా మారింది. మనిషి డబ్బులు ఇవ్వడం వరకు మాత్రమే తాను బాధ్యుడనుకుని వైద్యుని చేతిలో మన ఆరోగ్య బాధ్యతలను పెట్టేసి ఆయనిచ్చిన మందులు తింటూ, ఆహార వ్యవహారాల్లో ఏమాత్రం జాగ్రత్త లేకుండా విచ్చలవిడిగా తింటూ తిరుగుతూ ఉంటే ఆరోగ్యం సరిగ్గా ఎలా వుంటుంది? మనుషులు ఆరోగ్యంగా పుట్టి, ఆరోగ్యంగా జీవిస్తూ అనాయాసంగా మరణించడానికి కావలసిన వ్యవస్థను, పద్ధతులను, వసతులను విశేషజ్ఞులతో చర్చించి, ప్రజారోగ్య వ్యవస్థ ద్వారా దేశమంతా అందరికీ అందుబాటులో ఉండేట్లుగా చేయవలసిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలది. అలా జరుగుతున్నట్లు అనిపించడం లేదు. ప్రభుత్వాలు 'అలోపతి' వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, మన సంప్రదాయ వైద్య పద్ధతులను మాత్రం 'ప్రత్యామ్నాయ' పద్ధతులంటున్నారు. నిజానికి భారతదేశంలో అలోపతి, హోమియోపతి లాంటివే 'ప్రత్యామ్నాయ' వైద్యాలు. మనదైనదే ఆయుర్వేదం. మన వైద్య విధానాన్ని పాశ్చాత్య పైన్సు నిర్ధారిస్తే తప్ప ప్రజలకు అందించలేని దుస్థితి ఏర్పడింది. లక్షలాది ప్రజల రుగ్మతను నిర్మూలించే ఈ ఆయుర్వేద పద్ధతిని ప్రామాణికం చేయాలంటే ప్రస్తుతం అందరికీ ఆమోదయోగ్యమైన పద్ధతి, పథకం ఏదీ కనిపించడం లేదు. వివిధ ప్రభుత్వ ఆరోగ్య సంస్థలు, శాస్త్రజ్ఞులు, పరిశోధనశాలలు, విభిన్న మార్గాల్లో పయనిస్తూ 'ప్రగతి' అంటున్నారే తప్ప, వీరి మధ్య సామరస్యం కాని, ఏకీభావం కాని కనిపించటం లేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రస్తుతం మన జనాభాలో నాల్గోవంతు కూడా ఆయుర్వేదాన్ని వాడటం లేదట. ఇదే కాక, ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థలు ఏ దేశాలైతే తమ స్వంత వైద్య పద్ధతులను ఆచరిస్తుంటాయో అటువంటి వాటికి ఆర్థిక, రాజకీయ సహాయ సహకారాలను నిరాకరిస్తున్నారు. ఇదే కొనసాగితే ఆయుర్వేదం మరుగున పడి చరిత్రగా మారటానికి ఎంతో సమయం పట్టదు.

ఈ పరిస్థితుల్లో మన వంటింటి ఆరోగ్య పద్ధతులు, స్థానిక ఆయుర్వేద ప్రక్రియలు, మూలికా వైద్యులు, మారుమూలల్లో వున్న ప్రజలకు కావలసిన ఆరోగ్యాన్ని అందించడానికి ఎంతో తోడ్పతారు. ఈ పద్ధతులు వాడడం వల్ల ప్రతి పౌరుడు వైద్యానికి తక్కువ ఖర్చు పెట్టే అవకాశముంటుంది. స్థానిక వనరులను సరిగా ఉపయోగించుకోవడం కూడా సాధ్యమవుతుంది. స్థానికంగా ఉద్యోగావకాశాలు పెరిగి, ప్రజలు గ్రామాల నుండి పట్టణాలకు వలస పోవటం తగ్గుతుంది.

పల్లెసృజన గత 12 సంవత్సరాలుగా మనుషుల వైద్యానికి, పశువుల వైద్యానికి, పంటలకు నష్టం కలిగించే తెగులు, పురుగుల నివారణకు సంబంధించిన 2000కు పైగా సాంప్రదాయ మూలికా వైద్య పద్ధతులను తెలుగు రాష్ట్రాల్లోని మూలికావైద్యుల నుండి సేకరించింది. ఇందులో ఆరు ఉత్తమ ప్రక్రియలను ఎన్ఐఎఫ్ ఇండియా సహకారంతో పేటెంటుకై దరఖాస్తు చేయటం జరిగింది. మరెన్నో అద్భుత ఫలితాలిచ్చే మూలికా వైద్యాలను ప్రజలందరికీ అందించడానికి 'పల్లెసృజన' నిర్విరామంగా కృషి చేస్తున్నది. ఎన్నో ప్రభుత్వ సంస్థలు, విశేషజ్ఞులు, మహానుభావులు, మూలికా వైద్యులు మాకు ఈ ప్రయత్నంలో తోడ్పడుతున్నారు, ఎంతో సహకారాన్ని అందిస్తున్నారు.



ఆయుర్వేద వైద్యానికి ప్రాచుర్యం కల్పించాలన్న సదుద్దేశ్యంతో 'పల్లెసృజన' పత్రికలో మూలికా వైద్యానికి సంబంధించిన అంశాలను తరచూ ప్రచురిస్తూనే వుంది. ఈ జ్ఞానాన్ని వినియోగించి, మీ అనుభవాలను మాతో పంచుకోవాలని పాఠక మహాశయులను కోరుతున్నాము.

'విళంబి' నామ నూతన తెలుగు సంవత్సర శుభాకాంక్షలతో, మీ అందరికీ శుభం కలగాలని మనసారా ప్రార్థిస్తూ ........

భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)



### తన సృజనాత్మకతకు పదునుపెట్టి కనిపెట్టిన సివిఆర్

# సుస్థిర హరిత వ్యవసాయ పద్ధతి

- పల్లె వీర రాఘవ రెడ్డి

'మట్టి మనిషి' చింతల వెంకట రెడ్డి (సివిఆర్) ని గురించి 'పల్లెసృజన' పాఠకులకు గుర్తు చేయాల్సిన అవసరం లేదు. హైదరాబాద్ 'పాత అల్వాల్' ప్రాంతానికి చెందిన వ్యవసాయ కుటుంబంలో పుట్టినవాడు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకుని, నిత్యం రైతు శ్రేయస్సుకు తన ఆలోచనలతో పదును పెడుతున్న రైతు బాంధవుడు చింతల వెంకట్ రెడ్డి. గత నాలుగైదు సంవత్సరాలుగా శోధించి, తన మట్టి వ్యవసాయా నికి మరో ఆలోచనను జోడించి అద్భుత విజయం సాధించాడు ఆయన నూతనంగా అభివృద్ధి చేసిన సృజన (ఇన్నోవేషన్)ను గురించి తెలుసుకుందాం.

మానవాళితో పాటు, ప్రతి పంట ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు ప్రకృతిలో ఉన్నాయన్నది సివిఆర్ వాదన. కాకపోతే, అవి ఎక్కడ వున్నాయి, వాటిని ఎలా ఉపయోగించుకోవాలి అని తెలుసుకుంటే చాలు వీలైనంత తక్కువ ధరలో, లేదా ఎటువంటి ఖర్చు లేకుండా మనం వినియోగించుకోవటం ద్వారా పంటలు, సమాజం ఆరోగ్యంగా ఉండొచ్చు అంటారాయన. ఈ విషయాన్ని తెలుసుకున్న తర్వాత అయ్యో ఉచితంగా ప్రకృతి ప్రసాదించిన దాన్ని మనం వాడకుండా, ఇంత ఖర్చు చేసి కొనుగోలు చేసి మరీ వాడుతున్నామా? అనిపిస్తుంది. సాధారణంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు వరి, గోధుమ పంటలలో పిలకలు ఎక్కువగా రావాలంటే డిఎపి తప్పనిసరిగా వాడాలి అంటారు. దానికి కారణం ఆ రసాయనిక ఎరువులో మొక్కలు పిలకలు వేయటానికి ప్రధానంగా కావలసింది పాస్ఫరస్ అనే ఔషధం. ఈ ఫాస్ఫరస్ (భాస్వరం)ను రసాయనిక ఎరువుగా కాకుండా, ప్రకృతిలో లభించదా అని గత 5 సంవత్సరాలుగా శోధించాడు. అందరూ చెప్తున్నదేమిటంటే సేంద్రియంగా ఈ పాస్ఫరస్ 'బోన్ మీల్' లేదా 'ఫిష్‌మీల్' ద్వారా లభిస్తుంది. కానీ, అది మాంసాహారంతో తయారయ్యేది కాబట్టి కొందరు దీన్ని అంగీకరించరు. మనం తినే ఆహారంలోనే 'ఫాస్ఫరస్' వుంటుంది కదా అనే ఆలోచనతో మాంసము, గ్రుడ్డు, గోధుమ, పచ్చి పాలు ఇంకా మొదలైన ఆహార పదార్థాలలో భాస్వరం అధికంగా వుంటుందని గ్రహించాడు. మనం ఆహారం తింటేనే ఇంత శక్తి వస్తుంది కదా, మరి ఈ ఆహారాన్ని పంటలకు అందిస్తే వాటికి శక్తి రాదా అని ఆలోచించాడు సివిఆర్.

200 లీటర్ల ఎండిన పైమట్టి, లోపలి మట్టి ద్రావణంలో 2 లీటర్లు పచ్చి పాలు కలిపి తన గోధుమ పంటపై పిచికారి చేసి చూశాడు. కొంత వరకు తేడాను గమనించాడు. అయినా తనకు తృప్తినివ్వలేదు. సరే చూద్దామని మరోసారి అదే మట్టి నీటిలో 2 కిలోల గోధుమ పిండి కలిపి పిచికారి చేశాడు.



కేవలం మట్టి నీరు స్ప్రే చేసిన పొలం | వరి మొలకలు మెత్తగా రుబ్బి మట్టి నీటిలో కలిపి స్ప్రే చేసిన పొలం

ఇంకాస్త తేడాను గమనించాడు. అయినా తనకు నచ్చక ఇంకా ఎక్కువ భాస్వరం అందే మార్గం ఏమిటా అని శోధిస్తుండగా, భూమిలో మొలకెత్తే విత్తనాలను గమనించాడు. అప్పుడు తోచింది ఆయనకు ఒక అద్భుతమైన ఆలోచన. 'చిన్న మొలక పైకి రావటానికి భూమిని చీల్చుకుని వస్తుంది అంటే ఈ చిన్న మొలకలో ఎంతో శక్తి దాగుంటుంది కదా', ఇది తన సమస్యకు పరిష్కారమేమో అనుకుని 2 కిలోల గోధుమలను నానబెట్టి మొలకెత్తేలా చేసి, ఆ మొలక విత్తనాలను మెత్తగా రుబ్బి మట్టి నీటితో కలిపి గోధుమ పంటపై పిచికారి చేశాడు. తాను ఊహించిన ఫలితం వచ్చింది. అంత వరకు ఒక్కో మొక్కకు 20 లేదా అంతకన్నా తక్కువ పిలకలుండేవి. ఈ ద్రావణం ఒక్కసారి పిచికారి చేయటంతోనే 30కి పైగా పిలకలు పెరగటం గమనించాడు. తన పరిశోధన ఫలవంతమైందని గ్రహించి, దీన్ని తాను మాత్రమే ఉపయోగిస్తే చాలదు, వేరే పంటలపై కూడా ప్రయోగించి చూడాలని కొమరం భీం జిల్లా, సిర్పూర్ మండలంలోని, 'లోనవెల్లి' గ్రామానికి చెందిన వెంకటేశ్వర రావు అనే రైతుకు 100 లీటర్ల మాగబెట్టిన మట్టి నీటిలో ఒక కిలో చొప్పున మొలకెత్తిన వరిగింజలను మెత్తగా రుబ్బి అందులో వేసి నీ వరి పంటపై పిచికారి చేసి చూడమని సలహా ఇచ్చాడు. ఆయన సివిఆర్ చెప్పిన పద్ధతి ప్రకారం చేయగా, ఆయనకు కూడా కేవలం పది రోజుల్లో 15 దాకా పిలకలు అదనంగా వచ్చాయి. కేవలం మాగబెట్టిన మట్టిని పిచికారి చేసిన దానికన్నా ఈ పద్ధతిలో రెట్టింపు పిలకలు వేయటంతో పాటు, పైరు ఆకుపచ్చదనం పెరగటం, ఆకులు కొద్దిగా వెడల్పుగా మారటం గమనించిన ఆ రైతు తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ సివిఆర్‌కు ఫోన్‌లో చెప్పాడు. తన పొలం ఫొటోలను, వీడియోలను 'సివిఆర్ వాట్సాప్ గ్రూపు'లో పంపడంతో చింతల వెంకట్ రెడ్డి గారు తన పరిశోధన ఫలవంతమైందని ఆనంద పడ్డాడు.

దీన్ని బట్టి రైతు బాంధవుడు సివిఆర్ గారికి అర్థమైందేమిటంటే, మనిషికి, మనిషి రక్తం ఎక్కిస్తేనే పని చేస్తున్నట్లు, ఏ పంటకు ఆ పంట గింజలను మొలకెత్తించి, మట్టి ద్రావణంలో కలిపి పిచికారి చేస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయని, గోధుమల్లో భాస్వరం శాతం అధికంగా వుంటుంది కనుక మొలకెత్తిన గోధుమ గింజలను అన్ని పంటలపై వినియోగించుకోవచ్చు అంటారాయన.

ఇక్కడ రైతులు మరో విషయం గమనించాలి. భాస్వరం నేరుగా పంటకు అందించే మార్గం లభించినపుడు కేవలం మొలకెత్తిన గింజల ద్రావణాన్ని పంటపై పిచికారి చేస్తే సరిపోతుంది కదా అనుకుంటారు. కానీ నేరుగా పిచికారి చేసిన ద్రావణాన్ని పురుగులు "ఆహా ఈ రైతు మన కొరకు మంచి ఆహారాన్ని పిచికారి చేశాడు" అని వాటిని సేవిస్తూ బ్రతికేస్తాయి. కాని మట్టి ద్రావణంతో కలిపి పిచికారి చేసినట్లయితే, ఆ ద్రావణాన్ని పురుగులు తిని నశిస్తాయి అంటాడు చింతల వెంకట్ రెడ్డి. మొలకెత్తిన గింజల పిండి



సివిఆర్ ప్రయోగం విజయవంతంగా ఫలించిన వెంకట్‌రెడ్డి గోధుమ పొలం




కలిపటం వల్ల కేవలం అధిక భాస్వరం అందటమే కాదు, ఆ పైరుకు సంబంధించిన సంపూర్ణ పోషకాలు ఇందులోనే ఉన్నాయని గ్రహించాడు సివిఆర్.

మన పంటపై కేవలం రెండు కిలోల మొలకెత్తిన విత్తనాలను మెత్తగా రుబ్బి, మట్టి ద్రావణంలో కలిపి పిచికారి చేస్తే పంటకు ఎలా పని చేస్తుంది అని భావించే కొందరు రైతులకు ఆయన ఇచ్చే సమాధానం "ఒక్క విత్తనం భూమిలో వేస్తే పదుల నుండి వందల గింజలు తయారవుతున్నపుడు, నువ్వు ఇంత ద్రావణం పిచికారి చేస్తే అంత ఫలితం ఎలా వస్తుందనే అనుమానం నీకెందుకు" అంటారాయన. తాను స్వయంగా తన పంట ఎదుగుదల కాలం పూర్తయిన తర్వాత కూడా ఈ ద్రావణాన్ని పిచికారి చేస్తే ఆ గోధుమ పంట ఆకుల పరిమాణం పెరగడం, పచ్చదనం పెరగటం, గింజలలో పోషకాలు పెరగటం గమనించాడు. దీన్ని బట్టి మొక్కకు కావలసిన 'నైట్రోజన్' కూడా ఈ ద్రావణం ద్వారా అందుతుంది అని తెలుసుకున్నాడు. కొందరు సేంద్రియ రైతులు పుల్లటి మజ్జిగతో కొన్ని రకాల ద్రావకాలు తయారు చేసి పంటలపై పిచికారి చేస్తుంటారు, వాటిలో కూడా ఫాస్పరస్ ఉంటుంది కాబట్టే ఆ పంటలు పచ్చదనాన్ని పొందుతున్నాయి. రైతులు ఈ తేడాలను గమనించాలనుకుంటే రసాయనాలు వాడిన, సేంద్రియ పద్ధతిలో పండించిన మొక్కలను రెండింటినీ పీకి వేరు వ్యవస్థను గమనిస్తే రసాయనాలు పంటలపై ఎంతటి దుష్ప్రభావాన్ని చూపుతాయో ఎడమవైపు చిత్రాన్ని చూస్తే ఈ విషయం అవగతమవుతుంది.

**మట్టిని పిచికారి చేసే పద్ధతిలో వెలు చూసిన కొత్త విషయాలు:**

చింతల వెంకట్‌రెడ్డి ఇంత వరకు మట్టిని నీటిలో కలిపి, తేరిన నీటిని పంటపై పిచికారి చేస్తే ఎటువంటి పురుగులైనా నశిస్తాయి, పంట ఏపుగా పెరుగుతుంది అని చెప్పేవాడు. ఈ పద్ధతి తెలుసుకున్న ఉత్తర ప్రదేశ్ లోని గోరఖ్‌పూర్‌కు చెందిన సురేంద్రసింగ్ అనే 43 సంవత్సరాల వయసు గల ఒక రైతు వెంకట్ రెడ్డి గారికి ఫోన్ చేసి తన 'ఆలుగడ్డ' పంటకు ఇప్పటివరకు రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగించానని, ప్రస్తుతం తన పంట ఆరోగ్యంగాను, పచ్చదనంతో ఉందని, మీ పద్ధతి నాకు చాలా బాగా అనిపిస్తుంది, నేను ఇప్పుడు నా పంటపై ఉపయోగించ వచ్చా అని అడిగాడు. అందుకు వెంకట్ రెడ్డి ఉపయోగించటం వల్ల మీకు లాభం లేకపోవచ్చు కాని, నష్టమైతే లేదు వాడి చూడండి అని సలహా ఇచ్చాడు. ఆ రైతు సరే చూద్దామని తన పొలాన్ని రెండు భాగాలుగా చేసుకుని ఒక భాగంలో కేవలం లోపలి మట్టిని, రెండవ పొలంలో 'పైమట్టి + లోపలి మట్టి'ని పిచికారి చేశాడు. మూడు రోజుల తర్వాత మరలా ఫోన్ చేసి పంటలో ఎటువంటి మార్పును నేను గమనించలేదు అన్నాడా రైతు. దానికి వెంకట రెడ్డి 'కడుపు నిండిన మనిషికి అదనంగా ఆహారం ఇవ్వడంవల్ల ఉపయోగం ఏముంటుంది. నీ పంట ఇప్పటికే ఆరోగ్యంగా వుందన్నారు కదా కాబట్టి దీనినుండి ఎటువంటి ఫలితం మీకు కనబడలేదు' మరోసారి ఎప్పుడైనా పంటపై ఏదైనా లోపాలున్నపుడు వాడి చూడు అన్నాడు. మరో వారం రోజుల తర్వాత నా ఆవాల పంటపై 'మిల్లీబగ్' (పిండినల్లి) పురుగు ఆశించింది, దీని నివారణకు మీ పద్ధతిని ఉపయోగించమంటారా అని అడిగాడు. సరే కేవలం లోపలి మట్టిని మాత్రమే తీసుకుని, పది రోజుల్లో మూడుసార్లు పిచికారి చేసి చూడు అని సలహా ఇచ్చారు. పిచికారి చేసిన తర్వాత



రెండవరోజు ఫోన్ చేసి వెంకట్ రెడ్డిగారూ నా ఆవాల పంటపై ఒక్క పిచికారితోనే పురుగు నశించింది మీకు ధన్యవాదాలు అన్నాడు. దానికి వెంకట్ రెడ్డి ఆశ్చర్యపోయి, ఒక్క పిచికారికే పురుగు నశించటమేమిటి, ఏం చేశావు, ఎలా చేశావు నువ్వు చెప్పు అన్నాడు. దానికి సురేంద్రసింగ్ ఏమీ లేదు సార్ మీరు మట్టిని నీటి డ్రమ్ములో వేసి బాగా కలియదిప్పి కొద్దిసేపటి తర్వాత పిచికారి చెయ్యమన్నారు. నేను కొద్దిసేపు ఎందుకని, దాదాపు అరగంటసేపు కలియదిప్పిన తర్వాత కొద్దిసేపు ఆగి, తేరుకున్న నీటిని పిచికారి చేశాను అన్నాడు.

అప్పుడు అర్థమైంది వెంకట్ రెడ్డి గారికి ఎక్కువసేపు కలియతిప్పటం వల్ల లోపలి మట్టిలోని జిగట నీటిలో బాగా కలిసి, పురుగులను వెంటనే చంపేసిందని. మామూలుగా కుమ్మరి పని చేసేవారు మట్టిని నానబెట్టి ఎంతోసేపు కాళ్ళతో తొక్కి దాన్ని జిగటగా చేసిన తర్వాతనే ఆ మట్టిని కుండలు చేయటానికి ఉపయోగిస్తారు. ఎక్కువసేపు తొక్కటం వల్ల మట్టి ఎక్కువ జిగటగా మారి, కుండలు చేయటానికి ఎంతో అనువుగా వుంటుంది. అలాగే మట్టినీటిని ఎక్కువసేపు కలియతిప్పటం వల్ల జిగట బాగా నీటిలో కలిసిపోయి, ఆ మట్టి రేణువులు కీటకాలను వెంటనే నివారించ గలిగాయి అంటున్నారు వెంకట్ రెడ్డి.

మరో పది రోజుల తర్వాత అదే సురేంద్రసింగ్ అనే రైతు ఫోన్ చేసి, వారి ప్రాంతంలో ఎక్కువగా మంచు (ఫ్రాస్ట్) కురిసి దాదాపు తన పొలానికి చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిలోగల ఆలుగడ్డ పొలాలన్నీ దెబ్బతిన్నాయి, కానీ తన పొలం మాత్రం ఎటువంటి నష్టానికి గురి కాలేదు అన్నాడు. అంతేకాదు కేవలం లోపలి మట్టి స్ప్రే చేసిన పొలంలో ఆలుగడ్డలు మామూలు సైజులోనే వున్నాయి, పంట దిగుబడి కొంత ఎక్కువగా వచ్చింది, కానీ లోపలి మట్టి, పైమట్టి రెండూ కలిపి పిచికారి చేసిన పొలంలో గడ్డ సైజు పెరగటంతో పాటు, మొక్కకు ఎక్కువ గడ్డలు వచ్చాయని, ఇదంతా కేవలం మీ పద్ధతి ఉపయోగించటం వల్లనే ఇలా జరిగిందని తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. తన రెండు పంటలపై మట్టి ద్రావణం పిచికారి చేయటం వల్ల జరిగిన పంటల అభివృద్ధి చూసి తన చెఱకు తోటపై కూడా ప్రయోగించగా ఆ చెఱకు పంట కూడా తాను ఊహించని విధంగా పచ్చదనాన్ని పొందింది. (పైనున్న ఫొటో). పంట పెరుగుదలలో కూడా విపరీతమైన మార్పు వచ్చింది అన్నాడు.

దీనివల్ల నాకు అర్థమైందేమిటంటే, ఒక్కసారి మట్టి



మట్టి ద్రావణం స్ప్రే చేసిన తన చెఱకు పొలంలో రైతు సురేంద్రసింగ్

ద్రావణం స్ప్రే చేసినా సరే పంట తనకు అవసరమైనప్పుడు దాన్ని వినియోగించుకునే శక్తిని పొందుతుందని అన్నారు వెంకట్‌రెడ్డి. మామూలుగా మూడు రోజుల పాటు మంచు కురిసిందంటే ఒక్క గోధుమ, శనగ తప్ప మిగతా పంటల ఆకులన్నీ దాదాపు ఎండిపోతాయి. అటువంటిది సురేంద్రసింగ్ వేసిన బంగాళా దుంప ఎండిపోలేదు అంటే ఈ మట్టి ద్రావణం మంచు వర్షాన్ని (కొన్ని ప్రాంతాల్లో ధూంధార అంటారు) కూడా తట్టుకునే శక్తిని మొక్కకు అందిస్తుందన్నమాట.

గొప్ప గొప్ప శాస్త్రవేత్తలు చేయాల్సిన ప్రయోగాలు, కనుగొనాల్సిన విషయాలను ఒక రైతు కనుగొని నిరూపించడం మానవాళికి, మన దేశానికే గర్వకారణం. చింతల వెంకట్ రెడ్డి గారికి యావత్ రైతాంగం తరుపున 'పల్లెసృజన' కృతజ్ఞతలు తెలియజేస్తోంది. ఈ సరళమైన, సునాయసంగా రైతులు అవలంభించ గలిగే పద్ధతులను దేశమంతటా త్వరగా వ్యాప్తి చెందాలని, తక్కువ ఖర్చుతో భారతీయ రైతులు పంటలు పండించుకోవాలని 'పల్లెసృజన' కోరుకుంటోంది.

**చింతల వెంకట్‌రెడ్డి ఫోన్ : 9866 88 3336**

**రైతు వెంకటేశ్వర రావు ఫోన్ : 7702405925**

**గోరఖ్‌పూర్ రైతు సురేంద్రసింగ్ ఫోన్ : 99353 14355**

**(ఈ రైతుతో హిందీలో మాత్రమే మాట్లాడవలసి వుంటుంది)**



# అమ్మకానికి సిద్ధంగా ఉన్న గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎస్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## పెద్ద చెట్టు ప్రూనింగ్ చేసే యంత్రం

**సమస్య – పరిష్కారం :**

పండ్ల తోటలలో సాధారణంగా చెట్ల కొమ్మలను ప్రూనింగ్ చేయటం ద్వారా చెట్లు నియంత్రణ లేకుండా ఎత్తుకు పెరగకుండా, చెట్టు దట్టంగా వచ్చి కాపు ఎక్కువగా వచ్చి, ఫలాలు సులభంగా తెంచుకునే వుండటానికి అనువుగా వుంటుంది. సాధారణంగా ఈ పని గొడ్డలి, చాకు, రంపాలతో చేస్తూ వుంటారు. ఈవిధానం కష్టతరమైంది, ఎక్కువ కూలీలు అవసరమౌతారు, పైగా ప్రమాదంతో కూడుకున్నది. వీటితో సరియైన రూపం రాకపోవటమే కాక, ఎక్కువ సమయం కూడా తీసుకుంటుంది. చాలా ఎత్తున్న కొమ్మలను ప్రూనింగ్ చేయటానికి ప్రత్యేకమైన నిచ్చెనల సహాయం తీసుకోవాల్సి వుంటుంది. వీటన్నిటికి పరిష్కారంగా రాజస్థాన్‌కు చెందిన గుర్‌మేల్ సింగ్ ధోస్సీ అనే రైతు ఒక ఆటోమేటిక్ ఎలక్ట్రో మెకానికల్ ప్రూనింగ్ యంత్రాన్ని తయారు చేశాడు.



**పరికరం :**

ట్రాక్టరుకు అనుసంధానం చేసే ఈ పరికరం ఎంత పెద్ద చెట్టునైనా ప్రూనింగ్ చేయటానికి ఉపయోగ పడటమే కాక, ఎత్తయిన కొమ్మలను కూడా కత్తిరించ గలదు. హైడ్రాలిక్ సిస్టం వుండటం ద్వారా పైకి క్రిందకి వెళ్ళటం సులభమౌతుంది.

**సాంకేతిక వివరాలు :**

- కనీసం 40 హార్స్‌పవర్‌ల సామర్థ్యం గల ట్రాక్టరుకు అనుసంధానం చేసే పరికరం.
- హైడ్రాలిక్ సదుపాయం కలదు.
- 15 కిలోవాట్ల హైడ్రాలిక్ మోటారుతో పని చేస్తుంది.
- మోటారు స్పీడు 1000 ఆర్‌పియం.
- ఇంటర్మీడియట్ షాఫ్ట్, 2000 ఆర్‌పియం.
- సెంట్రల్ షాఫ్ట్ 3000 ఆర్‌పియం.
- బ్లేడ్లు 4,200 ఆర్‌పిఎం.

**ముఖ్యాంశాలు :**

- 20 అడుగుల ఎత్తయిన చెట్టును కూడా ప్రూనింగ్ చేయగలదు.



- 20 అడుగుల వెడల్పున్న రోడ్డుకు ఇరువైపుల వున్న చెట్లను ఒకేసారి ప్రూనింగ్ చేసుకోవచ్చు.
- పండ్ల తోటల్లో 200 చెట్లను కేవలం ఒక గంటలో పూర్తి చేయవచ్చు.
- ట్రాక్టరు కదలకుండా వుండి చుట్టూ 10 అడుగుల వ్యాసంలో తిరుగుతూ చెట్లను ప్రూనింగ్ చేసుకోవచ్చు.

**పురస్కారాలు :**

- 2012లో జరిగిన ఎన్ఐఎఫ్ వారి 6వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో బహుమతి పొందారు గుర్మైల్‌సింగ్ ధోనీ.



**కావాలనుకున్నవారు సంప్రదించండి :**

పల్లెసృజన, ఫోన్ : 040-27111959, సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)



# పొలాన్ని చదును చేసి అదనపు మట్టిని టిప్పర్‌లో నింపే యంత్రం

**సమస్య – పరిష్కారం :**

చదునుగా లేని వ్యవసాయ భూములలో పంట వేయటం కష్టం. సాధారణంగా వర్షాలకు భూమి కోసుకు పోవటం ద్వారా పొలాల్లో ఎత్తు పల్లాలు ఏర్పడుతాయి. అటువంటి సందర్భాలలో ఎక్కువైన, ఎత్తుగా వున్న మట్టిని త్రవ్వి తీసి, పొలంలో తగ్గు వున్నచోట కానీ లేదా బయట వేయాల్సి వుంటుంది. ఇది చాలా ఖర్చుతో కూడుకున్న పని. దీనికి చాలామంది కూలీలు, చాలా సమయం పడుతుంది. ఈ సమస్యకి పరిష్కారంగా పంజాబ్‌కు చెందిన 'కుల్దీప్ సింగ్ మరియు రేషమ్ సింగ్'లు వేరువేరుగా భూమిని త్రవ్వి టిప్పర్లోకి నేరుగా ఎత్తి పోసే యంత్రాలను రూపొందించారు. ఈ యంత్రాలతో పొలాలను చదును చేయటమే కాక, ఎక్కువగా వున్న మట్టిని టిప్పర్‌లోకి ఎత్తి తక్కువగా వున్నచోట వేయటం కాని, లేదా బయటకు తీసుకువెళ్ళి పడవేయటం కాని సులభంగా చేసుకోవచ్చు. రైతులకు ఎంతో సమయం, ఖర్చు ఆదా అవుతుంది.

**పరికరం :**

ఈ మట్టిని త్రవ్వి టిప్పర్‌లో నింపే పరికరం ట్రాక్టర్‌కు అనుసంధానం చేసుకోవాల్సి వుంటుంది. ఇది భూమిని త్రవ్వి కన్వేయర్ బెల్టు ద్వారా నేరుగా టిప్పర్‌లోకి పంపుతుంది. ఇందులో త్రవ్వే విభాగం కాకుండా రెండు కన్వేయర్ బెల్టులు వుంటాయి. మొదటిది మట్టిని పైకి ఎత్తటానికి, ఎత్తిన మట్టిని టిప్పర్‌లోకి వేసేది రెండోది. ఇది ఒకసారి 4 అంగుళాల లోతువరకు భూమిని త్రవ్వగలదు.

**సాంకేతిక వివరాలు :**

- రెండు నిమిషాలలో 11–6–2.25 అడుగుల సైజు టిప్పర్‌ను మట్టితో నింపగలదు.
- 50 హార్స్‌పవర్ శక్తిగల ట్రాక్టర్‌కు దీన్ని అనుసంధానం






చేసుకోవాల్సి వుంటుంది.

- గంటకి 5 నుండి 6 లీటర్ల డీజిలు ఖర్చవుతుంది.
- ఒకేసారి 4 అడుగుల వెడల్పులో, 4 అంగుళాల లోతు భూమిని త్రవ్వి తీసి 8.5 అడుగుల ఎత్తు నుండి టిప్పర్‌లోకి పడేయ గలదు.

**ముఖ్యాంశాలు :**

- కాలువలు త్రవ్వటానికి, రోడ్లు వేయటానికి, ఇళ్ళు కట్టడానికి ఎంతో అనువైన యంత్రం.
- సరాసరిన రోజుకి 150 టిప్పర్‌ల మట్టిని త్రవ్వి తీయగలదు.

**పురస్కారాలు :**

- 2013లో జరిగిన ఎన్ఐఎఫ్ వారి 7వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో బహుమతిని ఇన్నోవేటర్లు సంయుక్తంగా పొందారు.

**కావాలనుకున్నవారు సంప్రదించండి:**

పల్లెసృజన, ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.


మల్లేష్ ఫెడల్ పంపు



రోషన్‌లాల్ విశ్వకర్మ చెరుకు కణుపులను కత్తిరించే సాధనం


కరెంటు స్తంభాలనెక్కే చెప్పులు


గోపాల్ భిసే సైకిల్ నాగలి




మల్లేష్‌సోలార్ స్ప్రేయర్, లైటు ఫ్యాన్ల రిమోట్

హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.
ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :
67, రోడ్ నెం. 2, వాయుపురి,
సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700.

## మహిళల శ్రమకు ఒక మహిళ సరళ పరిష్కారం

# రసాయనాలు లేని శుభ్రపరిచే ద్రావణాలు

## శ్రీమతి దూబ రాజు సరికొత్త ఇన్నోవేషన్



- పల్లె వీర రాఘవ రెడ్డి

విశాఖపట్నం నగరానికి చెందిన దూబ కనకారావు గారి భార్య శ్రీమతి దూబ రాజు 58 సంవత్సరాల ఒక సాధారణ గృహిణి. ఆమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె. భర్త ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులుగా పనిచేసి ప్రస్తుతం విశ్రాంత జీవనం కొనసాగిస్తున్నారు. కుమారుడు 'సి.ఎ.' చేస్తుండగా, కూతురు కంపెనీ సెక్రెటరీ కోర్సు చదువుకుంటున్నారు. మామూలుగా 'రాజు' అనే పేరును మగ సంతానానికే పెట్టడం మనం చూస్తూ వుంటాము. అలాంటిది వీరి తల్లిదండ్రులు ఈమెకు 'రాజు' అని నామకరణం చేయటమే ఒక ఆశ్చర్యం. ఇప్పుడు ఆమె ఎవరికైనా తన పేరు చెప్పాలంటే 'శ్రీమతి రాజు' అనే చెప్తుంది. ఈ పేరును చాలామంది భర్త పేరు 'రాజు' వుంటుందేమో అనుకుంటారు. బహుశా ఈమె తల్లిదండ్రులు అప్పట్లోనే మాకు అమ్మాయి అయినా అబ్బాయి అయినా ఒకటే కాబట్టి 'రాజు' అని నామకరణం చేశారేమో మొత్తానికి తన పేరులోని ప్రత్యేకతకు తగ్గట్లుగానే ఈమె విశిష్ఠమైన ఇన్నోవేషన్‌లు చేసింది.

**పరికరాలను శుభ్రం చేసే ద్రావణం :**

సాధారణ హైందవ కుటుంబం ఇల్లాలు అయిన శ్రీమతి రాజు గారికి దైవభక్తి ఎక్కువ. నాలుగు సంవత్సరాల క్రితం పూజకు ఉపయోగించే ఇత్తడి సామాగ్రి, దేవుని విగ్రహాలను శుభ్రం చేయటానికి సాధారణంగా అందరు స్త్రీలలాగే ఈమె కూడా చింతపండుతో చేసేది. ఇలా శుభ్రం చేసినప్పుడల్లా చేతి వేళ్ళు ఒక రకమైన అలర్జీకి గురయ్యేవి. అంటే చేతి వేళ్ళు దురదగా వుండటం, ఏదో తెలియని అసహనంగా అనిపించేది. చింతపండు తన ఒంటికి పడటం లేదని గమనించింది. అప్పట్లో 'పీతాంబరి' అని విగ్రహాలను, కంచు పాత్రలను శుభ్రం చేసే ఒక పౌడర్ మార్కెట్లో లభిస్తుందని తెలుసుకుని దాన్ని ఉపయోగించి చూసింది. దానివల్ల ఈమెకు అలర్జీ ఏమీ కలిగేది కాదు కాని, వస్తువులు తాను అనుకున్నంత శుభ్రంగా అయ్యేవి కాదు, పైగా కొద్ది రోజులలోనే మళ్ళీ మరకలు పేరుకుని నలుపుగా అవటం గమనించింది. ఇది తనకు నచ్చలేదు. దీనికి పరిష్కారం ఏదైనా చేస్తే బావుంటుందని ఆలోచించి, తానే రకరకాల ప్రకృతి సహజంగా పండిన కూరగాయలు, ఆకులు, అలములను ఉపయోగించే మొత్తానికి ఎటువంటి పాత్రలనైనే సరే శుభ్రం చేయ గలిగే ఒక ద్రావకాన్ని తయారు చేసింది.

ఈ ద్రావకం తాను అనుకున్నంతగా శుభ్రం చేయటంతో, ఇది తనకు మాత్రమే తృప్తినిస్తే చాలదు అని

గమనించి తన బంధు-మిత్రులకు, తన అపార్ట్‌మెంట్‌లోని మహిళలకు కూడా ఈ ద్రావణాన్ని ఇచ్చి వాడి చూడండి అని చెప్పింది. వాళ్ళు ఈ ద్రావణాన్ని ఉపయోగించి ఈమెకు కొన్ని సలహాలు అందించారు. కొందరు శుభ్రం చేయటానికి నీటిని ఎక్కువగా ఉపయోగించాల్సి వస్తుందని, పాత్రలు ఎక్కువగా మెరవటం లేదని.... ఇలా రకరకాల సూచనలు చేశారు. వాళ్ళ సూచనలను తాను ఒక సవాలుగా తీసుకుని తాను తయారు చేసిన ద్రావకానికి మరికొన్ని మెరుగులు దిద్దింది. అప్పుడు తాను ఊహించినంత స్వచ్ఛంగా శుభ్రంగా చేయగలిగే ద్రావకం తయారైంది.

తాను తయారు చేసిన ద్రావకం 'ఇత్తడి, రాగి, కంచు, పంచలోహ' పరికరాలను శుభ్రం చేయగలిగేది కాబట్టి ఇటువంటి పాత్రలు చాలామంది గృహాల్లో వుండవని, ఈ లోహాలు గల ఏకైక ఆవాసాలు 'దేవాలయాలు' అని గ్రహించింది. అనుకున్నదే తడవుగా తాను నిత్యం సందర్శించే దేవాలయాల అర్చకులను, దేవాలయ కమిటీ పెద్దలను సంప్రదించి, తాను తయారు చేసిన ద్రావణం ద్వారా మూల విరాట్‌లకు అలంకరించే ఆభరణాలు, పూజా సామాగ్రులను శుభ్రం చేసేందుకు తనకు సహకరించమని కోరింది. ఈ ద్రావణంలో ఎటువంటి రసాయనాలు ఉపయోగించలేదు, కేవలం కూరగాయలు, కొన్ని రకాల ఆకులతోనే తయారైంది కాబట్టి పాత్రలకు ఎటువంటి నష్టం చేకూరదని, తనకొక్క అవకాశం ఇవ్వమని వారిని కోరింది. ఆయా వ్యక్తులు ఈమె కోరికను సాదరంగా ఆహ్వానించి అవకాశమివ్వటంతో 'శ్రీమతి రాజు' ఆ దేవాలయాల్లోని పూజా సామాగ్రి, విగ్రహాలకు అలంకరించే రక రకాల లోహాలతో తయారైన ఆభరణాలను శుభ్రం చేయటం జరిగింది.

ఆలయాలకు వచ్చే భక్తులు విగ్రహాలకు అలంక



శుభ్రపరచిన కంచు పాత్ర



సేంద్రియ ద్రావణంతో శుభ్రం చేసిన దేవాలయ సామాగ్రి

రించిన వస్తువులు గతంలోకంటే మిన్నగా తళతళ లాడుతుం టడం గమనించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇది గమనించిన ఆలయ అధికారులు శ్రీమతి రాజుగారు తయారు చేసిన ద్రావణాన్ని కొనుగోలు చేయటం, మరీ ఎక్కువగా వున్న సామాగ్రిని శుభ్రం చేసేందుకు ఈమెను పిలవటం.... కొన్ని చిన్న చిన్న ఆలయాల వారు ఈ ద్రావకాన్ని కొనటం, ఇలా దినదినాభివృద్ధి చెంది ఈ ద్రావకం వాడకం అధికమైంది. ఈమె భర్త, కూతురు, ఆలయ సమీపంలోని భక్తులు కూడా ఒక్కోసారి స్వచ్ఛందంగా వెళ్ళి ఆలయ పూజా, అలంకార సామాగ్రిని శుభ్రం చేసే వ్యాపకం పెరిగి పోయింది.

శ్రీమతి రాజు గారు 'డ్వాక్రా' సభ్యురాలు కావటంతో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో 'డ్వాక్రా బజార్' ఏర్పాటు చేసే కార్యక్రమాలకు కూడా వెళ్ళి తన 'శుభ్రపరిచే ద్రావణం' అమ్మకాలు కొనసాగిస్తూ ఉంది. ప్రతి సంవత్సరం డిశంబరు మాసంలో ఏర్పాటు చేసే డ్వాక్రా బజార్‌లో 2015 నుండి 2017 వరకు తన ద్రావకాన్ని ప్రదర్శించి, అమ్మకాలు చేసింది. ఇలా తాను తయారు చేసిన ద్రావకం సమాజంలోకి వెళ్ళింది.

### ఆభరణాలను శుభ్రం చేసే ద్రావణం :

శ్రీమతి రాజు గారు తన సృజనాత్మకతకు ఇంకా పదును పెడుతూ మహిళలు నిత్యం ఎదుర్కొనే తమ వెండి, బంగారు ఆభరణాలు శుభ్రం చేసుకోవడంపై దృష్టి సారించింది. ఆభరణాలను శుభ్రం చేయటానికి ప్రతిసారి ఆభరణాల తయారీ దుకాణాలకు వెళ్ళటం వల్ల ఎంతో కొంత నష్టం, లోహం అరుగుదలను దృష్టిలో వుంచుకుని వారు తమంతట తామే తమ ఆభరణాలను శుభ్రం చేసుకునేందుకు వీలుగా కూరగాయలు, ఆకులు, అలములతోనే మరో





ద్రావకాన్ని తయారు చేసింది. ఈ ద్రావకాన్ని ఉపయోగించి తమ ఇంట్లోనే తాము ఒక బ్రష్షుతో శుభ్రం చేసుకోగలరు. చేతులకు రసాయన పదార్థాల వల్ల ఎటువంటి అలర్జీ ఏర్పడకుండా, ప్రకృతిలో తయారైన వాటితో చేసిన ఈ ద్రావకం ఉపయోగించుకుని, తళతళలాడే ఆభరణాలతో మిళమిళలాడుతూ బయటకు వెళ్ళవచ్చు.

### ఇంట్లో బండలను శుభ్రం చేసే ద్రావణం :

అలాగే ఇంటిని శుభ్రం చేయటానికి మార్కెట్లో లభిస్తున్న రసాయనాలకు భిన్నంగా సహజసిద్ధమైన ఒక ద్రావణాన్ని తయారు చేసిందీమె. మార్కెట్లో లభించే రసాయనాలు గదిలో పేర్కొన్న ధూళిని శుభ్రం చేస్తాయే కాని, మురికిని సమూలంగా తీసివేయలేవు అని గమనించింది శ్రీమతి రాజు. ఈమె తయారు చేసిన ద్రావణం ధూళితో పాటు, మురికిని కూడా శుభ్రం చేస్తుంది. ఈ ద్రావకంతోపాటు మార్కెట్లో లభించే రసాయనాలను వినియోగించి చూస్తే ఎవరికి వారే తేడాను గమనించవచ్చు అంటుందీమె. ఇంట్లోని ఒక గదిలో మార్కెట్లో లభించే ద్రావణంతో శుభ్రం చేసి, మరో గదిలో ఈమె తయారు చేసిన ద్రావకం వినియోగించినట్లయితే ఆ రెండు గదులను శుభ్రం చేయటానికి వాడిన నీటిని గమనిస్తే చాలు అర్థమైపోతుంది అంటారు. ఈమె తయారు చేసిన ద్రావణం కలిపిన నీళ్ళు నల్లగా మారుతాయి, మార్కెట్లో లభించే రసాయనం కలిపిన నీరు కొద్దిగా మాత్రమే నల్లబడటాన్ని గమనించవచ్చు. దీన్ని బట్టి గదిలోని ధూళిని శుభ్రం చేయటమే కాదు, మురికిని కూడా శుభ్రం చేస్తుందన్న విషయం తేటతెల్లమవుతుంది. ఈమె తయారు చేసిన ద్రావణంలో స్వచ్ఛంగా నిమ్మగడ్డి నుండి తయారు చేసిన ద్రావకం మిళితమవటంతో పరిపూర్ణంగా శుభ్రం చేస్తుందని అంటారీమె. ఈ ద్రావకం వాడటం ద్వారా గదిలోని బ్యాక్టీరియా పూర్తిగా చస్తుంది అంటారు శ్రీమతి రాజు.

### వంట ఇంటిని శుభ్రం చేసే ద్రావణం :

దీనితో పాటు 'కిచెన్ బయో క్లీన్' అనే మరో ద్రావణాన్ని కూడా తయారు చేసింది. సాధారణంగా వంటింట్లో మనం చేసే వంటల తాలూకు అవశేషాలు పేరుకుపోయి, వంట ఇంటి గోడలు జిడ్డుగా మారటం సహజమే. అటువంటి జిడ్డును సమూలంగా తొలగించే వేసేలా ఈ కిచెన్ బయోక్లీన్ ద్రావణాన్ని తయారు చేసింది. ఈమె తయారు చేసిన ద్రావణాలను ఉపయోగించటం ద్వారా చేతులకు ఎటువంటి హాని జరగదు. ఎందుకంటే ఈ ద్రావణాలు పూర్తిగా సహజసిద్ధమైన వాటితో తయారైనవి అన్న విషయాన్ని గమనించాలి అంటున్నారు శ్రీమతి రాజు.

తాను తయారు చేసిన అన్ని ద్రావణాల్లో మరో గుణాన్ని కూడా కనుగొంది శ్రీమతి రాజు. ఈమెకు మధుమేహ వ్యాధి వుంది. దేవాలయాలకు వెళ్ళి అక్కడి విగ్రహాలకు తగినట్లుగా పెద్ద పెద్ద ఆభరణాలు (ఆర్చి లాంటివి) ఒక చెక్కకు అమర్చబడి వుంటాయి. వాటిని శుభ్రం చేస్తున్నపుడు ఒక్కోసారి చేతులకు గాయాలు అవుతాయి. అయితే ఈ గాయాలకు తానేమీ మందు వాడకుండానే వాటంతట అవే మానిపోవటం తనకు ఎంతో ఆశ్చర్యం వేసిందని అంటున్నారు. అంటే ఈ

ద్రావకానికి గాయాలను మాన్పే గుణం కూడా ఉందని రుజువైంది.

**టమోట పండ్లను ఎక్కువ రోజులు నిలువ వుంచే ద్రావణం :**

తన సృజనాత్మకతను వీటితో ఆపకుండా మరో ద్రావకం తయారీకి పూనుకుంది శ్రీమతి రాజు. తాను నిత్యం వార్తల్లో వింటున్న 'టమోట' రైతుల మనో వేదనను గమనించి ఈ టమోట పండ్లు ఎక్కువ రోజులు నిలువ వుండేలా ఏదైనా ద్రావణం తయారు చేస్తే బావుంటుందని వీటిపైన కూడా ప్రయోగాలు మొదలు పెట్టి దాన్ని ప్రయోగించి విజయవంతంగా ఫలితాలను రాబట్టింది. ఒక్కోసారి మార్కెట్లో తగిన ఖరీదు లభించనపుడు రైతులు కనీసం టమోట పండ్లను తెంపటం కూడా కూలీలు దండగ అని భావించి వాటిని పొలంలోనే వదిలేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. అలా కాకుండా టమోటాలను తెంపి, వాటిని ద్రావకంలో ముంచటం ద్వారా అవి 30 నుండి 40 రోజుల వరకు మార్కెట్లో అమ్మేందుకు సహజ సిద్ధంగా ఉంటాయని నిరూపించింది. ఈ ద్రావణం ఉపయోగించటం ద్వారా 30 రోజుల తర్వాత చాలా కొద్దిగా బరువులో తేడా వస్తుందే తప్ప పండులో ఎటువంటి నాణ్యత లోపించదు అంటారీమె. ద్రావకంలో ముంచిన టమోటాలను మామూలుగా గదిలో ఉంచితే చాలు, ఏ ప్రత్యేక రక్షణా అవసరం లేదు.

ఇది రైతులు వినియోగించ గలిగితే వారికి ఇదొక వరంగా భావిస్తారు. ఎందుకంటే ప్రస్తుతం కూరగాయల ధరలలో అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకోగలిగేది ఒక్క టమోట మాత్రమే. ఇది ఒక్కోసారి కిలో 80 రూపాయల వరకు వెళ్తుంటే, మరోసారి కిలో కేవలం రూపాయికన్నా కూడా తక్కువగా అమ్మగలిగే పరిస్థితి నెలకొంటుంది. ఈ తక్కువ ధర కొన్ని రోజులు మాత్రమే వుంటుంది. అటువంటప్పుడు రైతులు నష్టపోకుండా, ఈ ద్రావణాన్ని వినియోగించటం ద్వారా తమ





పంటకు మంచి ధరను పొందవచ్చు. సహజ సిద్ధమైన పదార్థాలతో తయారైంది కనుక వినియోగదారునికి కూడా ఎటువంటి హాని ఉండదు.

శ్రీమతి రాజు మహిళల సమస్యలకు కనుగొన్న మార్గాలను సమాజానికి ఉపయోగ పడేలా చేయాలన్నదే 'పల్లెసృజన' ఉద్దేశ్యం. అందుకే పల్లెసృజన 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' సహకారంతో ఈ ద్రావణాన్ని తదుపరి పరీక్షలు చేయించేందుకు సిఫారసు చేసింది. ఈ కార్యక్రమాల్లో విశాఖ పట్నం శ్రీపాద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ శ్రీ అంజిరెడ్డి గారి సహకారం మరువలేనిది. ఈమె తయారు చేసిన ద్రావణాలను వెంటనే వినియోగంలోకి తీసుకు వచ్చి సమాజానికి ఉపయోగ పడేలా చేసేందుకు పల్లెసృజన ప్రయత్నాలు మొదలు పెట్టింది. అతి త్వరలోనే ఇవి అందరికీ అందుబాటులోకి వచ్చే అవకాశముంది. ఒక మహిళా ఇన్నోవేటర్ రూపొందించిన ఈ ద్రావణాలను యావత్ సమాజం వినియోగించుకుని, లాభపడాలని ఆశిస్తున్నాం. ఈ ప్రయత్నంలో సహకరించ దలచినవారు 'పల్లెసృజన' (ఫోన్ : 9866001678)తో సంప్రదించ గలరు.

శ్రీమతి రాజు ఒక సామాన్య గృహిణి అయినా ఆమె జీవన దృక్పథం విశిష్టం. ప్రకృతిలో లభించే వాటితో, తమ చుట్టూ వున్న సమస్యలను పరిష్కరించవచ్చన్న అపూర్వ విశ్వాసంతో సంవత్సరాల కొద్ది శ్రమించి, ప్రయోగాలు చేసి, డబ్బు, సమయం వెచ్చించి ఎన్నో ఆవిష్కరణలు చేశారు. ఆమెకున్న ఓపిక, దృఢనిశ్చయం, ప్రజా క్షేమం, ప్రకృతిపై విశ్వాసం, సమాజానికి ముఖ్యంగా యువతకు ఒక మార్గదర్శకం.

ద్రావణాలు కావలసిన వారు సంప్రదించండి :

**ఇన్నోవేటర్ శ్రీమతి రాజు : 95738 19031**

**సుభాష్ చందర్ :96528 01700**

# మీ ప్రాంతంలో ఇన్నోవేషన్లు ప్రదర్శించాలా?

## పల్లెసృజనను సంప్రదించండి



'మేకిన్ ఇండియా' నినాదాన్ని భారత ప్రభుత్వం, ప్రత్యేకంగా ప్రధాన మంత్రి ప్రతి చోటా నినదిస్తున్నారు. కానీ 'పల్లెసృజన' 12 సంవత్సరాల క్రితమే మొదలు పెట్టింది. మన ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పునాది స్థాయి వ్యక్తులు, వారి అవసరాల కోసం తయారు చేసుకున్న ఇన్నోవేషన్లను వెలుగులోకి తీసుకు వచ్చి, వాటిని వారిచేతనే తయారు చేయించి, యావత్ సమాజానికి అందేలా కృషి సల్పడమే కాక, ఇన్నోవేటర్లకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కీర్తిని ఆపాదించడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నది. ఇప్పటి వరకు 12 మంది ఇన్నోవేటర్లకు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతుల చేతుల మీదుగా పురస్కారాలు అందేలా చేసింది పల్లెసృజన. ఒక ఇన్నోవేటర్‌కు ప్రధాని చేతుల మీదుగా 'అమేజింగ్ ఇండియన్' పురస్కారంతో పాటు అతనికి దేశంలో అత్యంత విలువైన 'పద్మశ్రీ–2017' పురస్కారం లభించేలా కృషి సలిపింది.

గ్రామీణులు ముఖ్యంగా వ్యవసాయదారులు ఇంతవరకు తమకు కావలసిన పనిముట్లను, పెద్ద పెద్ద పరిశ్రమల్లో తయారైనవి, ఇంజనీర్లు రూపొందించినవి, మరికొన్ని విదేశాల నుంచి దిగుమతి అయినవి. రైతులు వాటినే కొనుగోలు చేయక తప్పని పరిస్థితి వుంది. వీటిలో కొన్ని అన్ని రకాల పొలాలకు, రైతులకు పనికి వచ్చేవి కావు. కొంతమంది ఏదో సబ్సిడీలో లభిస్తున్నాయి కదా అని కొనుగోలు చేసి, అవి తమకు పని చేయక మూలకు పెట్టే పరిస్థితులు కూడా కొందరికి తెలిసిందే.

వీటికి ప్రత్యామ్నాయంగా గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లు వారి అవసరాల కొరకు వారు పరికరాలు తయారు చేసుకుంటున్నారని గుర్తించి, గత 12 సంవత్సరాలుగా వాటిని వెలుగులోకి తీసుకు వచ్చి, ఇవి ప్రజలందరికి చేరాలన్న తపనతో పనిచేస్తున్న సంస్థ 'పల్లెసృజన'. ఈ ఇన్నోవేషన్లన్నీ ప్రజల్లోకి చేరాలంటే ప్రతి గ్రామంలో వీటిని ప్రదర్శించాల్సిన అవసరముంది. అప్పుడే ప్రతి రైతు వీటిని ప్రత్యక్షంగా చూస్తే తక్కువ ధరకే, సమర్థవంతంగా పనిచేసేవి భావించి కొనుగోలు చేస్తారు.

ఎంతో కష్టమైన పనులను సులువైన మార్గాలను అన్వేషించిన మన ఇన్నోవేటర్లను ప్రోత్సహించండి, మన పనులను అనువైన వస్తువులను విదేశాల నుండి, కర్మాగారాలు తయారు చేసిన వాటిని ఎక్కువ ఖరీదు పెట్టి కొనాల్సిన అవసరం లేదు, సమర్థవంతంగా పని చేసే ఇన్నోవేషన్లను ప్రత్యక్షంగా పరిశీలించి మీ ప్రాంత ప్రజలు కొనుగోలు చేసేలా కృషి చేయాలనుకున్న వారు వెంటనే సంప్రదించండి.

మీ ప్రాంతాల్లో ప్రదర్శనకు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు

**బ్రిగేడియర్ పోగుల గణేశం : 9866001678**

**సుభాష్ చందర్ : 9652801700**

# ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో ఇన్నోవేషన్ & ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఫెస్టివల్


Hon'ble President of India Shri Ram Nath Kovind presented the Gandhian Young Technological Innovation (GYTI) Awards 2018 at Rashtrapati Bhavan








మార్చి 19-23, 2018 తేదీలలో ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.), కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్స్ & ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' ప్రదర్శన ఏర్పాటు చేయడమైనది. ఈ దర్శనలో 'పల్లెసృజన' తరుపున ఇన్నోవేటర్లు చింతకింది మల్లేశం, నన్నెం తిరుపతి పాల్గొనగా, బ్రిగేడియర్ పోగుల గణేశం, పల్లె వీర రాఘవ రెడ్డిల పర్యవేక్షణలో ప్రదర్శన ఎంతో సజావుగా జరిగింది. యావత్ దేశం నుండి ఎందరో పర్యవేక్షకులు మన ఇన్నోవేటర్ల ప్రతిభను మెచ్చుకున్నారు.

కార్యక్రమం చివరి రోజున 'గైతి' (......) పురస్కారాలు ఇచ్చే కార్యక్రమంలో భారత రాష్ట్రపతి చేసిన ప్రసంగం ఇన్నోవేటర్లను, ఆహుతులను ఎంతో ఉత్సాహానికి, ఉద్వేగానికి గురి చేసింది. "ఇన్నోవేటర్ల స్ఫూర్తిదాయకమైన కథనాలు సమాజానికి ఎంతో అవసరమని, వాటి ద్వారా ఎంతోమంది స్ఫూర్తి పొందితే ఎన్నో రకాల ఇన్నోవేషన్లు దేశానికి అందుతాయి" అన్నారు. 'పల్లెసృజన' మొదటి నుండి చేస్తున్న పనినే ఆయన మాటల్లో వినటంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్న బ్రిగేడియర్ గణేశం గారు ఈ విషయాన్ని విని ఎంతో ఆనందం పొందారు.

ఇన్నోవేటర్లలో చింతకింది మల్లేశం రూపొందించిన 'లక్ష్మి ఆసు యంత్రం' చేనేత కుటుంబాల్లోని అతి పెద్ద సమస్య ఆసు పోయటం అనే వ్యాపకానికి సమూల పరిష్కారం చూపింది. ఇక ఆసు పోయటం గతంలో మహిళలు చేసేవారు అన్నది చరిత్రలో మాత్రమే నిలిచిపోయేలా చేసిన ఈ యంత్రం పని తీరును మెచ్చుకోనివారు లేరు. మల్లేశం ఇప్పటికే వెయ్యికి పైగా ఆసు యంత్రాలను ఇవ్వటం జరిగింది.

అలాగే మరో ఇన్నోవేటర్ నన్నం తిరుపతిని ఒక దిన కూలీ నుండి ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చిన 'కరెంటు స్తంభాలను ఎక్కే చెప్పులు' ఇకపై విద్యుత్ పని చేసే కార్మికులు, కేబుల్ కార్మికులు ఇకపై ప్రమాదాలకు గురి కాకుండా చేసింది. ఇన్నోవేషన్‌ను చేయడమే కాకుండా, తిరుపతిరావు ఇప్పటికే 5000కు పైగా పరికరాలను అమ్మటం ద్వారా అంతమంది కుటుంబాలను ప్రమాదం నుంచి రక్షించగలిగాడు.





# వివిధ ఇంజనీరింగ్ కళాశాలల ఆధ్వర్యంలో ప్రదర్శనలు

## అన్నమాచార్య కళాశాల






కడప జిల్లాలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ల ప్రదర్శన మార్చి 5వ తేదీన జరిగింది. ఈ కార్యక్రమంలో 'పల్లెసృజన' ఇన్నోవేషన్లను ప్రదర్శించవలసిందిగా ఆహ్వానించింది కళాశాల యాజమాన్యం. ఈ ప్రదర్శనలో పల్లెసృజన వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారితోపాటు నలుగురు ఇన్నోవేటర్లు నాగ శ్రీనివాస్, షణ్ముఖరావు, కనకరాజులు పాల్గొని వారి ఇన్నోవేషన్లను ప్రదర్శించారు.

దాదాపు 500 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు పల్లెసృజన ఇన్నోవేటర్లను వారు చేసిన ఇన్నోవేషన్లను గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. అలాగే అన్ని ఇన్నోవేషన్లను గురించి కళాశాల అధ్యాపకులకు, యాజమాన్యానికి సవివరంగా తెలియజేశారు బ్రిగేడియర్ గణేశం. అక్కడ ప్రదర్శనకు నోచుకోని మరికొన్ని ఇన్నోవేషన్లను గురించి వీడియోల ప్రదర్శన జరిగింది. కళాశాల యాజమాన్యం ఇన్నోవేటర్లను, బ్రిగేడియర్ గారిని, ప్రదర్శన కో-ఆర్డినేటర్ సుభాష్ చందర్‌ను ఉచితంగా సత్కరించడం జరిగింది.

## స్ఫూర్తి కళాశాల





హైదరాబాదు శివారులోని 'స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల'లో మార్చి 19న జరిగిన 'పునాది స్థాయి ఇన్నోవేటర్లు - ఇంజనీరింగ్ విద్యార్థుల సమ్మేళనం' కార్యక్రమం ఆసాంతం ఎంతో ఆహ్లాదంగా జరిగింది. విద్యార్థులు ప్రతి ఇన్నోవేషన్‌ను ప్రత్యక్షంగా, క్షుణ్ణంగా పరిశీలించి పునదిస్థాయి ఇన్నోవేటర్ల సృజనాత్మకతకు ఎంతో అబ్బుర పడ్డారు. అవసరాలు, కష్టాలు ఇన్నోవేషన్లకు పునాది అవుతాయి అన్న విషయాన్ని తెలుసుకున్నారు. ఇన్నోవేటర్లందరూ వారి ఇన్నోవేషన్ల తయారీకి వారు పడి కష్టాలు, విజయ పరంపరలో సాగుతున్న వారి జీవన విధానాలను విన్న విద్యార్థులు ఎంతో ఉద్విగ్నతతో విన్నారు. ప్రతి ఇన్నోవేషన్ తయారీ వెనుక వున్న ఒక్కో కథను గురించి తెలుసుకోవటం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

స్ఫూర్తి కళాశాల యాజమాన్యం కూడా తమ విద్యార్థులకు 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు ఎంతో స్ఫూర్తి నింపారని అన్నారు. ఈ సమ్మేళనంలో మొత్తం 15 మంది ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించి వాటిని గురించి విద్యార్థులకు వివరించారు.

# 9వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో బహుమతి పొందిన ఇన్నోవేషన్లు




- 'ఎన్.ఐ.ఎఫ్. సౌజన్యంతో...

స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## రోబోటిక్ స్ప్రేయర్

**రాష్ట్ర స్థాయి బహుమతి**

**పంట :** రోబోటిక్ స్ప్రేయర్

**ఇన్నోవేటర్ :** గణేశ్ శెట్టి, చిక్‌మంగళూరు, కర్నాటక



కర్నాటక రాష్ట్రానికి చెందిన 59 సంవత్సరాల గణేశ్ శెట్టి ఎలక్ట్రిక్ పరికరాలను రిపేరు చేస్తూ వుండేవాడు. ఇతను రిమోట్ కంట్రోల్‌తో పని చేసే వక్క, కొబ్బరి చెట్లు ఎక్కి పురుగు మందు పిచికారి చేసే పరికరం తయారు చేశాడు.

గణేశ్ శెట్టికి వ్యవసాయ భూమిలేవీ లేవు. అతడికి వ్యవసాయం అంటే ఏమిటో తెలియదు. ముందునుంచీ ఇతను కరెంటు పరికరాలు, టెలివిజన్లు రిపేరు చేసే షాపు నడిపేవాడు. దురదృష్ట వశాత్తు కంటిచూపు మందగించటంతో రిపేర్లు మానేసి సౌర శక్తితో పనిచేసే లైట్లు, ఇతర పనిముట్లు బిగించే వృత్తిలోకి మారిపోయాడు. ఖాళీ సమయాలలో పిల్లలకి వారి సైన్సు ప్రాజెక్టులు తయారు చేసే పనిలో సహాయ పడుతూ వుంటాడు.

అసలు ఇటువంటి స్ప్రేయర్ తయారు చేయాలన్న ఆలోచన అతనికి వక్కలు పండించే వ్యవసాయ మిత్రులు తాము వక్క చెట్లకి తెగులు పట్టినపుడు పైకి ఎక్కి మందు చల్లటానికి 200 లీటర్లకి వెయ్యి నుండి 1200 రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. దీనికి నీవేదైనా సులభ మార్గం తయారు చేయవచ్చు కదా అని అడిగినపుడు వచ్చింది. ఇతను తన మిత్రులతో వివరంగా వారి సమస్యను తెలుసుకుని, చర్చించి, క్షేత్ర స్థాయిలో పరిశీలించి, వారి అవసరాలను పూర్తిగా అవగాహన చేసుకుని, దానికి తన స్వంత ఆలోచన చేర్చి మనిషి చెట్టు ఎక్కవలసిన అవసరం లేకుండా, పైన గెలలకు మందును పిచికారి చేసేలా ఒక రిమోట్ పరికరాన్ని తయారు చేశాడు. ఇది చాలావరకు రైతుల అవసరాలను తీర్చటంలో సఫలీకృతమైంది.

54 సిసిల పెట్రోల్ ఇంజన్ సహాయంతో పనిచేసే ఈ పరికరానికి రబ్బరు కాళ్ళుగల చైన్‌ను ఏర్పాటు చేశాడు. దీని సహాయంతో ఇది గొంగళి పురుగులా చెట్లను ఎక్కేస్తుంది. 50 నుండి 70 అడుగుల వరకు ఎత్తున్న వక్క, కొబ్బరి తాటి చెట్లను ఎక్కి, అక్కడ సునాయాసంగా కావాల్సిన మందును కింద వున్న

మనిషి రిమోట్ సహాయంతో పిచికారి చేయించవచ్చు. మనిషి చెట్టు ఎక్కాల్సిన అవసరం లేదు కానీ, పరికారాన్ని చెట్టుకు బిగించటానికి ఇద్దరు వ్యక్తులు అవసరమౌతారు. ఇదంతా కేవలం 7 నిమిషాల్లో పూర్తవుతుంది. 800 మీటర్ల దూరం నుండి కూడా రిమోట్‌తో పని చేయించుకోవచ్చు.

ఇతను తన మొదటి పరికరాన్ని 60 వేల రూపాయలు ఖర్చు పెట్టి తయారు చేశాడు. దీనికి ఇంకా ఎన్నో మార్పులు, చేర్పులు చేస్తున్నాడు. వక్క, కొబ్బరి, పామాయిల్ వ్యవసాయం చేసే రైతులకు ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కూలీల ఖర్చు తగ్గించటమే కాదు, ప్రమాదాలను కూడా నివారించ గలిగాడు గణేశ్ శెట్టి. చెట్టు ఎక్కి పైన కాయలకు స్ప్రే చేయలేక ఈమధ్య రైతాంగం కొబ్బరిచెట్టు తల్లివేరును త్రవ్వి తీసి ఆ వేరు ద్వారా రసాయన మందులు అందిస్తున్నారని





ఈమధ్య వార్తల్లో వచ్చింది. తెలుగు రాష్ట్రాల్లోని టెంకాయ పండించే రైతులకు ఇది ఎంతో అనువైనది.

**కావాలనుకున్నవారు సంప్రదించండి :**
పల్లెసృజన, ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)


## డిస్ట్రిబ్యూటర్లు కావలెను

పాఠకుల కోరిక మేరకు 'పల్లెసృజన' పత్రికను కేవం చందా దారులకే కాకుండా రిటైల్ మార్కెట్‌లో కూడా విక్రయించాలనుకుంటున్నాము. కావున మీ ఇంట్లోనే వుండి మీ జిల్లా/ మండలం/ సమీప పట్టణంలో గల పత్రికలు అమ్మే షాపు ద్వారా ఈ పుస్తకం విక్రయించటానికి ఆసక్తి గల వారు వెంటనే సంప్రదించండి. - ఎడిటర్

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
వీర రాఘవ రెడ్డి
**81257 99904/ 7989038186**
లేదా ఇ-మెయిల్ : narendragrafixhyd@gmail.com
**ద్వారా సంప్రదించవచ్చు.**

# వైబ్రేషన్ ప్యాడ్ల సహాయంతో వేరుశనగ త్రవ్వి తీసే యంత్రం



- 'ఎన్.ఐ.ఎఫ్. సౌజన్యంతో...

స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

**ప్రోత్సాహక బహుమతి**

**పరికరం : వైబ్రేషన్ ప్యాడ్లు కల వేరుశనగను త్రవ్వి తీసే యంత్రం**

**ఇన్నోవేటర్ :** రతన్‌రాం దుడ్‌వాల్, షికర్ జిల్లా, రాజస్థాన్.

మామూలుగా ట్రాక్టర్‌కు అమర్చే వేరుశనగను త్రవ్వి తీసే యంత్రాలు త్వరగా చెడిపోవటం, పూర్తిగా త్రవ్వి తీయలేక పోవటము, తీసిన వేరుశనగ కాయలకు మట్టి అంటుకొని వుండటం లాంటి లోపాలను గమనించిన రతన్‌రాం ఒక ప్రత్యేకమైన పరికరాన్ని రూపొందించాడు.

కేవలం 9వ తరగతి వరకు చదువుకున్న రతన్‌రాం తన తమ్ముడితో కలిసి 'జయ్‌కిషన్ కృషి యంత్ర ఉద్యోగ్' అనే పేరుతో ఒక మెకానిక్ షాప్‌ను స్థాపించి, తన పిల్లలు, తన తమ్ముడి పిల్లలు వ్యవసాయ పనిముట్లు తయారు చేయటం, రిపేరు చేయటం లాంటి పనులు చేస్తూ వుంటారు. చిన్నతనంలోనే చదువు మానేయటం వలన వ్యవసాయం చేస్తూనే, వ్యవసాయదారులకు అవసరమైన పనిముట్లైన నాగలి, గుంటక, సీడ్ డ్రిల్, వేరుశనగ త్రవ్వి తీసే పరికరం, ట్రాక్టరుకు ట్రాలీలు, చొప్ప నరికే యంత్రాలు, ట్రాక్టరుకు అనుసంధానం చేసే బుల్డోజరు లాంటి పరికరాలను రిపేరు చేసే సంస్థను స్థాపించుకున్నాడు.

తన చుట్టు ప్రక్కల ప్రాంతంలో రైతులు వేరుశనగను త్రవ్వి తీయటానికి కూలీలు లభించకపోవటం, దొరికినా వారు సమర్ధవంతంగా పని చేయకపోవటం, తప్పనిసరై వారు వేరుశనగ త్రవ్వి తీసే యంత్రాలను కొనుగోలు చేయటం, అవి కూడా తరచూ చెడిపోవటము, లేదా పొలంలో ఒక సాలు నుండి మరో సాలుకు తిరగటంలో ఇబ్బంది కలగటం లాంటివి గమనించాడు రతన్‌రాం. తానే స్వయంగా రెండుసార్లు వేరుశనగ త్రివ్వ తీసే యంత్రాలను కొనుగోలు చేశాడు. తనకీ అవే ఇబ్బందులు ఎదురు కావటంతో వాటిని అధిగమిస్తూ రెండు రకాల వేరుశనగ త్రవ్వి తీసే యంత్రాలను తయారు

చేశాడు. ఒకదాంట్లో యంత్రం ముందు భాగంలో ఒక స్ప్రింగుతో కూడిన చక్రాలు ఏర్పాటు చేయటంతో యంత్రంపై ఎక్కువ భారం పడకుండా, త్వరగా చెడిపోకుండా పని చేసేలా చేసింది. రెండో దానిలో యంత్రం వెనక చక్రాలు అమర్చటంతో ఒకసాలు నుండి మరో సాలుకు తిరగటం సులభమైంది. దీనికే ఒక బెల్టును ఏర్పాటు చేయటం వల్ల అది వైబ్రేటర్‌గా పని చేసి, వేరుశనగ కాయలకు అంటుకున్న మట్టిని తొలగించేలా చేశాడు.

ఈ రెండు పరికరాలు కూడా ట్రాక్టర్‌కు అనుసంధానం చేసుకునే విధంగా ఉన్నాయి. 8 గంటలలో 4 హెక్టార్ల పొలాన్ని 6 లీటర్ల డీజిల్ ఖర్చుతో వేరుశనగను త్రవ్వి తీస్తాయి. రతన్‌రాం గత 5 సంవత్సరాలలో 350కి పైగా పరికరాలను రూ. 1.20 నుండి 1.40 లక్షల ప్రకారం విక్రయించడం జరిగింది. తాను మొదట్లో 2011లో అమ్మిన పరికరం కూడా ఇప్పటికీ ఏలాంటి మరమ్మత్తులు లేకుండా పని చేస్తోందని గర్వంగా చెపుతారు. ఆ లక్షణమే అతన్ని 350 యంత్రాలను విక్రయించేలా చేసింది.

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వేరుశనగ తీయటానికి యంత్రాల వినియోగం చాలా తక్కువగా వుంది. ఇప్పటికీ కూలీలపైనే ఆధారపడి వేరుశనగ పంటను సేకరించాల్సి వస్తోండటంతో ఈ కూలీ భారం తట్టుకోలేక వేరుశనగ పంటవైపు రైతులు ఆసక్తి చూపటం లేదు. ఇటువంటి పరికరాలను వినియోగించుకోవటం ద్వారా కూలీల ఖర్చు తగ్గటంతో పాటు, తక్కువ పంట నష్టంతో నాణ్యమైన వేరుశనగను మార్కెట్‌కు తరలించవచ్చు.

**కావాలనుకున్నవారు సంప్రదించండి :**
పల్లెసృజన, ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)



# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

National Innovation Foundation-India



ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

# జాతీయ 11 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 11వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ** రెండవ **బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును.** జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును. అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. 10,000లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2019** లోగా మాకు చేరేలా పంపండి.


SRISTI HONEY BEE NETWORK GIAN

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 261131/32/ 38/ 39, Fax: (079) 26731903, Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై http://www.nif.org.in/announcement సంప్రదించండి. లేదా 'పల్లెసృజన' కార్యాలయాన్ని (ఫోన్ : **040-27111959**) సంప్రదించండి.

# దిన కూలీ నుండి ఉత్పత్తిదారున్ని చేసిన సృజనాత్మకత



## నన్నం తిరుపతి 'కరెంటు స్తంభాలనెక్కే చెప్పులు'



ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన హోంగార్డు ఉద్యోగం చేసే నన్నం రామదాసు, వరదానంల ఎనిమిది మంది సంతానంలో చివరి వాడు 27 సంవత్సరాల నన్నెం తిరుపతి. పెద్ద కుటుంబం కావటంతో అందరూ కష్టపడితే తప్ప సాగని జీవన పోరాట అతనిది. ప్రధానంగా కరెంటు స్తంభాలను ఎక్కి పైన రిపేర్లు చేయటం ఇతని ప్రధాన వృత్తి. అలా ఎక్కటంలో ఎన్నోసార్లు స్తంభం పైన పని చేసుకుంటూ ప్రమాద వశాత్తు క్రింద పడిపోవటం, ఎక్కేటపుడు చేతులు దోక్కుని పోవటం వల్ల ఎన్నోసార్లు గాయాల పాలయ్యాడు. ప్రతిచోటా నిచ్చెన వేసుకుని ఎక్కటం కుదరదు. కొన్నిచోట్ల నిచ్చెన లభిస్తుంది, మరికొన్ని చోట్ల నేరుగా స్తంభం ఎక్కటం తప్పనిసరి. తిరుపతి కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా పని చెయ్యక తప్పేది కాదు. తన తోటి కార్మికులు కొందరు క్రింద పడి అవిటివారు అయితే మరి కొందరు మరణించడం తిరుపతిని కలచి వేసింది. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనాలని ఎన్నో రోజులు ఆలోచించి దాదాపు రెండు సంవత్సరాల పాటు ఎన్నో రకాల స్తంభాలను ఎక్కే సాధనాలు తయారు చేశాడు.

మొదట ఒక అంగుళం వెడల్పున్న ఇనుప ఆంగిల్ తో 'ఎఫ్' ఆకారంలో ఒక పరికరం తయారు చేశాడు. దాన్ని ఉపయోగించి క్రిందనుంచి కరెంటు స్తంభాన్ని ఎక్కడం కుదిరేది కాదు, కానీ పైకి ఎక్కిన తర్వాత అక్కడ కూర్చుని పని సులభంగా చేసుకునే వీలు కలిగింది. దీన్ని ఇంకా బాగా అభివృద్ధి చేయాలి, క్రింద నుంచి స్తంభాన్ని ఏమాత్రం అలవాటు లేని వ్యక్తులు కూడా సునాయాసంగా ఎక్క గలిగేదిగా వుండాలని ఈసారి ఆంగిల్ కాకుండా ఒక అంగుళం వ్యాసం వున్న ఇనుప కడ్డీని తీసుకుని స్తంభానికి పట్టేలా చౌకంగా వంపులతో తయారు చేశాడు. ఆ ఇనుప కడ్డీలు కూడా తన

pole Climber 8 -Rcc mt



Pole Climber 8 - mt



గ్రామంలో నిర్మాణంలో వున్న చర్చికి చెందిన కొన్ని వృధా అయిన కడ్డీలను తీసుకుని తయారు చేయటం జరిగింది. ఆ పరికరాన్ని గ్రామంలో చూసిన వారందరూ చాలా బాగుందని మెచ్చుకోవటం, తోటి కార్మికులు కూడా సులభంగా స్తంభాలను ఎక్కి కరెంటు పనులను నిర్భయంగా చేసుకోవడంతో ఈ సమస్యకు పరిష్కారం లభించిందని సంతోష పడ్డాడు.

సెల్ ఫోన్‌ల వాడకం విపరీతంగా పెరిగిన నేటి సమాజంలో వీళ్ళు కరెంటు స్తంభాలను ఎక్కే విధానాన్ని వీడియో తీసి 'ఫేస్‌బుక్'లో పోస్టు చేయటం జరిగింది. తిరుపతి ఊహించని విధంగా ఆ వీడియోను 7 వేల మందికి పైగా వీక్షించడం, కొందరు తమకు కావాలి తయారు చేసి ఇవ్వమని దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల నుంచి వినియోగ దారులు అడగటం మొదలు పెట్టడంతో ఇంత చిన్న వస్తువును నేనెక్కడ చేసి వాళ్ళకు పార్శల్ చేసేదని ఆ పరికరం తయారు చేసుకునే విధానం, కొతలతో పాటు తన ఫోన్ నెంబరు కూడా మరోసారి ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు తిరుపతి. కొందరు చేసుకున్నారేమో కాని, చాలామంది అవన్నీ మేమెక్కడ చేసుకుంటాము, మీరే చేసి పంపండి, మీ బ్యాంకు అకౌంటు నెంబరు ఇస్తే మేము డబ్బులు వేస్తామని అడగటం మొదలు పెట్టారు.

ఇదేదో బాగానే వుంది కదా అని తన బ్యాంకు వివరాలు, పరికరం విలువలు పంపడం జరిగింది. తన పరికరానికి వచ్చిన స్పందన బాగానే వుంది అనుకుంటున్న తరుణంలో 'పల్లెసృజన'తో పరిచయం కావటం, పల్లెసృజన పాల్గొనే ప్రతి ప్రదర్శనలో తిరుపతి తన పరికరాన్ని ప్రదర్శించటంతో వాటికి గిరాకీ ఇంకా పెరిగింది. ఇప్పటికే కాశ్మీరు నుంచి కన్యాకుమారి దాకా దాదాపు దేశంలోని అన్ని రాష్ట్రాలకు తన పరికరాన్ని తయారు చేసి పంపటం జరిగింది.

పరికరం తయారు చేసి తన పనిని సులభం చేసుకున్నాను, కొంత మందికి ఉపయోగ పడుతున్నాను అని సంతోషిస్తున్న సమయంలో 'ఎన్.ఐ.ఆర్.డి.' వారు నా పరికరాన్ని గుర్తించి వారు ఏర్పాటు చేసి ప్రదర్శనలో పాల్గొనేలా చేసి పల్లెసృజనతో పరిచయం చేయటం నా అదృష్టం. ఆ ప్రదర్శనలో తిరుపతి పరికరానికి రూ. 50 వేల రూపాయల పారితోషికం కూడా అందివ్వటం జరిగింది. అప్పటినుండి పల్లెసృజన ఏర్పాటు చేసే ప్రతి ప్రదర్శనలో నన్ను పాల్గొనేలా చేయటం మూలంగా ప్రస్తుతం తన వృత్తిని వదిలి కేవలం ఈ పరికరాలను తయారు చేయటం, అడిగిన వినియోగ దారులకు అందించటమే ప్రధాన వృత్తిగా, వ్యాపారస్తుడిగా మార్చి వేసింది. అతి పేద కుటుంబంలో పుట్టి జీవన పోరాటం చేస్తున్న తనకు 'పల్లెసృజన' పరిచయంతో కేవలం రెండు సంవత్సరాల్లో ఇప్పటికే 5 వేలకు పైగా అమ్మటం జరిగింది. ఒక్కోదాని ఖరీదు కేవలం రూ. 1,500/–లు కావటంతో ఆర్డర్లు కూడా బాగానే





వస్తున్నాయి. రోజువారి కూలీగా పని చేసుకుంటున్న నన్ను కేవలం రెండేళ్ళలో దాదాపు కోటి రూపాయల దాకా వ్యాపారం చేయగలిగే స్థాయికి తీసుకు వెళ్ళిన ఘనత 'పల్లెసృజన'దే అంటున్నాడు తిరుపతి.

సృజనాత్మకతతో పాటు, తన పరికరాన్ని తానే తయారు చేసి అమ్ముకుంటున్నందుకు గాను 2018 మార్చి 19 –23 తేదీలలో ఢిల్లీలోని రాష్ట్రపతి భవనంలో జరిగిన ఇన్నోవేషన్లు – వ్యాపారుల ప్రదర్శన శాలలో రాష్ట్రపతి ముందు ఇతని పరికరాన్ని ప్రదర్శించే అవకాశం కల్పించాయి 'పల్లెసృజన' – 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' సంస్థలు.

గ్రామంలో కూలీ పని చేసుకుని బ్రతుకుతెరువు చేసుకునే నన్ను దేశంలోని అత్యున్నత వ్యక్తి భారత రాష్ట్రపతి చెంతకు వెళ్ళేలా చేసిన ఈ అనుభవాన్ని నా జీవితంలో మరచిపోలేను అంటాడు తిరుపతి.

పరికరానికి మార్కెట్‌లో మంచి పేరు రావటంతో వ్యాపారం కూడా పెరిగింది. ఇక ఇలా వ్యక్తిగతంగా కుదరదని "నన్నెం ట్రేడర్స్" అనే పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి, దాని ద్వారా ప్రస్తుతం వ్యక్తిగతంగా, కొన్ని చోట్ల ఏజెంట్ల ద్వారా, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ లాంటి ఆన్‌లైన్ వ్యాపార సంస్థల ద్వారా దీన్ని మార్కెటింగ్ పెంచుకున్నాడు తిరుపతి.

చిన్న వయస్సులోనే ఇంతటి పేరు సంపాదించటంతో పాటు, తన కుటుంబానికి పని కల్పించాడు తిరుపతి. ఇప్పుడు తన కుటుంబ సభ్యులందరూ కష్టపడి పని చేసి, వాటిని అమ్మే పనిలో నిమగ్నమయ్యారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు కూడా తిరుపతి 'స్తంభాలను ఎక్కే చెప్పులు' తమ విద్యుత్ శాఖ లైన్‌మెన్‌లకు అందే ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. తమిళనాడు ప్రభుత్వం నుండి కూడా ఆర్డర్లు వస్తున్నాయి. ఆ పనిలోనే ప్రస్తుతం తలమునకలై వున్నాడు తిరుపతి. ఎలాగైనా సరే ఈ పరికరం ప్రతి విద్యుత్ కార్మికులు, కేబుల్ కార్మికులకు చేరినట్లయితే ఇక కార్మికుల ప్రమాద చావులు వుండవని అంటున్నాడు తిరుపతి.

తిరుపతికి శ్రావణితో వివాహమైంది, ఒక కొడుకు, కూతురు కూడా జన్మించారు. ప్రస్తుతం ఇంటిముందు గల చెట్ల కిందనే తన పరికరాలను తయారు చేసుకుంటున్న తిరుపతికి త్వరలో ఒక షెడ్డు, అవసరమైన యంత్రాలను సమకూర్చే ప్రయత్నం చేస్తోంది 'పల్లెసృజన'. తిరుపతి తన పరికరాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, యావత్ దేశానికి అందించ గలగాలని, తద్వారా అటు కార్మికుల క్షేమంతో పాటు, ఇటు తిరుపతి కూడా ఆర్థికంగా నిలదొక్కుకోవాలని 'పల్లెసృజన' కోరుకుంటోంది.


**కావాలనుకున్నవారు సంప్రదించండి:**

**నన్నం తిరుపతి : 7780 433241**

**సుభాష్ : 96528 01700**

## ఎన్.ఐ.ఎఫ్. లో మీకు అవసరమైన ఇన్నోవేషన్‌ల అన్వేషణ

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ గత 25 యేళ్ళుగా సేకరించిన గ్రామీణ ఇన్నోవేషన్లు,**
**సాంప్రదాయ జ్ఞానం ప్రజలందరికీ అందుబాటులో వుండటానికై**
**ఒక వెబ్‌సైట్ తయారు చేసింది.**
**ఈ జ్ఞానమంతా వెబ్‌సైట్ www.nifindia.org లో చూడవచ్చు.**
**అలాగే మీకు ఏ సమస్యకైనా పరిష్కారం ఈ జ్ఞాన కోశంలో వుందో లేదో తెలుసుకోవాలనుకుంటే**
**NIF టోల్ ఫ్రీ నెంబర్ 1800 233 5555**
**కు కూడా ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.**
**కానీ ఫోన్‌లో మాట్లాడాలనుకునేవారు**
**ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రమే సంప్రదించవలసి వుంటుంది.**



# డా. ఎపిజె అబ్దుల్ కలాం
# ఇగ్నైట్
# పోటీలు 2018

> "నేర్చుకోవటం వల్ల సృజనాత్మకత వస్తుంది
> సృజనాత్మకత ఆలోచనలకి దారి తీస్తుంది
> ఆలోచనలు జ్ఞానాన్నిస్తాయి
> జ్ఞానం మిమ్మల్ని గొప్పవాళ్ళను చేస్తుంది"

**'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ - ఇండియా'** పాఠశాల విద్యార్థుల కొరకు వారి స్వంత సాంకేతిక ఆలోచనలు మరియు సృజనల జాతీయ స్థాయి పోటీలను నిర్వహిస్తున్నది.

**'డా. ఎపి.జె. అబ్దుల్ కలాం ఇగ్నైట్ పోటీలు-2018'** కి దరఖాస్తులు పంపుటకు **చివరి తేది 31 ఆగస్టు, 2018.** ఎన్ఐఎఫ్ పిల్లల సృజనాత్మకత మరియు ఇన్నోవేషన్ దినంగా జరుపుకునే మన మాజీ రాష్ట్రపతి దివంగత డా. ఎపిజె అబ్దుల్ కలాం గారి జయంతి రోజు (అక్టోబర్ 15)న విజేతల పేర్లు ప్రకటిస్తుంది.

అర్హమైనవి అని భావించిన ఇన్నోవేటివ్ ఐడియాలు/ప్రాజెక్టులను 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' గుర్తించి, వాటి అభివృద్ధికి, పేటెంట్‌కు సహకరిస్తుంది. 12వ తరగతి (10+ ఇంటర్మీడియట్) వరకు చదువుతున్న విద్యార్థులు (పాఠశాలేతర విద్యార్థులు, 17 సంవత్సరాల లోపు చిరంజీవులు కూడా) తమ ఎంట్రీలను తమ చిరునామా, పిన్ కోడ్, సెల్ ఫోన్‌తో సహా ఒక కాగితంపై వివరంగా వ్రాసి పోస్టు ద్వారా ఈ క్రింది చిరునామాలకు, లేదా ఈ-మెయిల్ ignite@nifindia.org ద్వారా పంపవచ్చు. ఆన్‌లైన్‌లో ద్వారా కూడా పంపవచ్చు.

పూర్తి వివరాలకు సంప్రదించండి :
**www.nif.org.in/ignite**

**National Innovation Foundation-India**
**Grambharati, Amarapur, Gandhinagar- Mahudi Road,**
**Gandhinagar - 382650, Gujarat, India.**
**Tel : 02764 261131/ 32/ 38/ 39, Fax : 011 43851803**
**E-mail : ignite@nifindia.org, web : www.nif.org.in/ignite**

dst.gov.in | honeybee.org | gian.org | sristi.org | cbse.nic.in

# రైతుల కొరకు రైతులు
# అభివృద్ధి చేసిన రకరకాల విత్తనాలు



'హనీబీ నెట్‌వర్క్' వాలంటీర్ల ద్వారా రైతులు దేశవ్యాప్తంగా అభివృద్ధి చేసిన రకరకాల విత్తనాలు సేకరించబడ్డాయి. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఈ వివరాలను పొందుపరిచింది. తెలుగు రైతులకు అవగాహనకై 'పల్లెసృజన' మన ప్రాంతానికి అనువైన పంటల విత్తనాలను గురించి వివరాలు ఈ క్రింద ప్రచురిస్తోంది. - ఎడిటర్

**విత్తనాల వివరాలు**

| విత్తనం | రకం పేరు | విత్తనం | రకం పేరు |
|---|---|---|---|
| వరి | హెచ్ఎంటి | గాదరగడ్డ | సంతోష్ క్యారెట్ |
| వరి | సుర్జీత్ బాస్మతి-1 | ఉల్లి | బల్వాన్ |
| గోబి పువ్వు | అజిత్‌ఘడ్ | ఉల్లి | రషీద్‌పురా |
| వంకాయ | కెజడ్‌కెబి | కంది | రిచా-2000 |
| ఆవాలు | సితార-శ్రీనగర్ | | |

### హెచ్.ఎం.టి. వరి వంగడము:

**ఇన్నోవేటర్:** దాదాజీరామ్‌జీ ఖోబ్రగాడె, నాందేడ్, మహారాష్ట్ర.



దాదాజీ రామ్‌జీ రూపొందించిన హెచ్.ఎం.టి. వరి రకం హెక్టారుకు 40 నుండి 45 క్వింటాళ్ళ దిగుబడి ఇస్తుంది. గింజలు చిన్నవిగా వుంటాయి. ఎక్కువ బియ్యం (80%) అవుతాయి. మంచి సువాసన కలిగి ఈ బియ్యంతో వండిన అన్నము రుచికరంగా వుంటుంది.

### సుర్జీత్ బాస్మతి-1 వరి వంగడము :

**ఇన్నోవేటర్ :** సుర్జీత్ సింగ్, కర్నల్, హర్యానా.



సుర్జీత్ బాస్మతి-1 అనే వరి వంగడము 'పూసా-1460' రకం వరి నుండి అభివృద్ధి చేయడం జరిగింది. ఈ బియ్యం కొద్దిగా ఉప్పగా ఉంటాయి. పంట కాలం 125-135 రోజులు వుంటుంది. హెక్టారుకు 55-60 క్వింటాళ్ళ వరకు దిగుబడి వస్తుంది. గింజల నుండి 67% వరకు బియ్యం వస్తుంది. గింజ పొడవు 11.16 మి.మీ. వరకు ఉంటుంది. వేరుకుళ్ళు 'షీత్ బ్లైట్' అనే తెగుళ్ళను తట్టుకుంటుంది. ఈ రకం వడ్లకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తుంది.

### 'అజిత్‌ఘడ్' రకం క్యాలీఫ్లవర్ :

**ఇన్నోవేటర్ :** జగదీష్ ప్రసాద్ పారిఖ్, శికర్, రాజస్థాన్.

1970లో జైపూర్ నుండి కొన్ని క్యాలీఫ్లవర్ మొక్కలను



తెచ్చి నాటగా అందులో కొన్ని మొక్కలు మిగతా వాటికన్నా భిన్నంగా వుండి, మార్కెట్‌లో సాధారణంగా దొరికే వాటికన్నా పెద్ద పువ్వు రావటాన్ని గమనించిన రైతు ఆ విత్తనంపై కొన్ని సంవత్సరాలపాటు ప్రయోగాలు చేసి దాని నాణ్యతని స్థిరీకరించాడు. ఈ రకం కాలీఫ్లవర్ 15 కిలోల వరకు బరువుంటుంది. అన్ని రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకోగల శక్తి కలది. దీనికి రోగ నిరోధక శక్తి కూడా ఎక్కువే కాబట్టి త్వరగా పురుగుల బారిన పడదు. మొక్క కాండం ఒకటిన్నర నుండి రెండున్నర అంగుళాల లావుండి, మూడు నుండి నాలుగు అడుగుల ఎత్తు వరకు పెరుగుతుంది. దీని ఆకులు పెద్దగా ఒకటిన్నర నుండి రెండంగుళాల పొడవుంటాయి. ఇది సంవత్సరానికి మూడుసార్లు కోతకు వస్తుంది.

### కెజడ్‌కెబి-1 సాంప్రదాయ వంగ రకము :

**ఇన్నోవేటర్ :** లక్ష్మీభాయ్ జులాపి, బాగల్‌కోట్, కర్నాటక

ఈమె రూపొందించిన సాంప్రదాయ వంగ రకము



ఎర్రనేలలో బాగా దిగుబడి వస్తుంది. 26 నుండి 30 డిగ్రీల వేడిమి వరకు తట్టుకుంటుంది. దిగుబడి హెక్టారుకు 35 నుండి 40 టన్నుల వరకు వస్తుంది. వంకాయ సైజు పెద్దగాను, గుండ్రంగాను, ఆకర్షణీయమైన వంగ రంగు కలిగి వుంటుంది. ఎంతో రుచికరమైనది.

### 'సితార-శ్రీనగర్' అభివృద్ధి చేయబడిన ఆవాలు :

**ఇన్నోవేటర్ :** హకుమ్‌సింగ్ లోధా, భారత్‌పూర్, రాజస్థాన్.

'సితార-శ్రీనగర్' అనే ఆవాలు రకం హెక్టారుకు 30 నుండి 35 క్వింటాళ్ళ దిగుబడినిస్తాయి. ఈ గింజలలో నూనె శాతం ఎక్కువ (42%), ఈ రకం పంట కాలం 120 నుండి 130 రోజులలో కోతకు వస్తుంది.



### అభివృద్ధి చేయబడిన 'క్యారెట్' రకం :

**ఇన్నోవేటర్ :** శ్రీమతి సంతోష్ పచార్, శికర్, రాజస్థాన్.

ఈ రకం క్యారెట్ ఒకటిన్నర అడుగుల వరకు





పొడవుగా పెరుగుతుంది, తియ్యగాను, ముదురు గోధుమ రంగు కలిగి, మృదువుగా వుంటుంది. రెండున్నర నుండి 3 మాసాల్లో కోతకు వస్తుంది. దుంపకు ప్రక్క వేర్లు (వెంట్రుకల లాంటివి) చాలా తక్కువగా వుండి, హెక్టారుకు 630 క్వింటాళ్ళ వరకు దిగుబడినిస్తుంది. ఈ రకం చూడటానికి ఆకర్షణీయంగా వుండటం వల్ల మార్కెట్‌లో అధిక ధర పలుకుతుంది.

**బల్వాన్ ప్యాజ్ – ఉల్లి రకము**

**ఇన్నోవేటర్ :** బల్వాన్ సింగ్, భీవాని, హర్యానా.



ఈ రకం ఉల్లి ఆకారంలో పెద్దదిగాను, గుండ్రంగాను వుంటుంది. (5 సెం.మీ. గుండ్రం, మెడ మందము 0.8 సెం.మీ., ఒక్కో గడ్డ 50 నుండి 60 గ్రా. బరువు) వుంటుంది. గట్టిగా అమర్చబడిన రెక్కలతో చిక్కటి ఎరుపు రంగు కల గడ్డలు. హెక్టారుకు 350 క్వింటాళ్ళ వరకు దిగుబడి వస్తుంది. దృఢమైన పొట్టు కలిగి వుంటుంది. విత్తనాలు 98 శాతం మొలక శాతాన్ని కలిగి వుంటాయి.

**'రషీద్‌పురా ప్యాజ్' ఉల్లి రకము :**

**ఇన్నోవేటర్ :** మనారామ్ చౌదరి, శిఖర్, రాజస్థాన్.

రషీద్ పురా ప్యాజ్ అనే ఉల్లి రకము ఎటువంటి వాతావరణంలోనైనా పండుతుంది. చలికాలంలో కూడా మంచి దిగుబడి వుంటుంది. హెక్టారుకు 40,000 కిలోల గడ్డలు దిగుబడి వుంటుంది. సరాసరిన 24 నుండి 30 వేల కిలోలు హెక్టారుకు దిగుబడి వస్తుంది. ఉల్లి చాలా ఘాటు కలిగి వుంటుంది. కేవలం 110 నుండి 115 రోజుల్లో కోతకు వస్తుంది. వర్షాభావాన్ని కూడా బాగా తట్టుకుంటుంది.



**'రిచా–2000' కంది రకం :**

**ఇన్నోవేటర్ :** రాజ్‌కుమార్ రాథోడ్, మధ్యప్రదేశ్.

అధిక దిగుబడినిచ్చే 'రిచా–2000' కంది రకం



ఏపుగా, గుబురుగా పెరిగే రకం. ఐసిపిఎల్–87 అనే కంది రకం పంట వేయగా అందులో ఒక మొక్క చాలా ఏపుగా పెరిగి, పచ్చగా, పెద్ద పూలతో, పొడుగాటి ఆకులతో ఉండటం గమనించిన రైతు ఆ మొక్క విత్తనాలను ప్రత్యేకంగా సేకరించి, దానిపై ఎన్నో రకాల ప్రయోగాలు చేసి మంచి ఫలితాల కోసం మొక్క ఏపుగా పెరగటానికి, అధిక దిగుబడి రావటానికి తలలు తుంచేస్తూ వచ్చాడు. దీనితో కొమ్మలు పెరిగి మంచి దిగుబడి వచ్చింది. ఈ రకం కంది సంవత్సరానికి మూడుసార్లు పంటకు వస్తుంది. దిగుబడి ఎకరాకు 24 క్వింటాళ్ళ వరకు ఉంటుంది.

**విత్తనాలు కావాలనుకున్నవారు సంప్రదించండి :**

పల్లెసృజన, ఫోన్ : 040–27111959,

సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)




ఆయుర్వేదం జ్ఞాన మథనం




# 'త్రికటకాలు'తో వైద్య చిట్కాలు

'శొంఠి, పిప్పళ్ళు, మిరియాలు' ఈ మూడింటిని కలిపి "త్రికటకాలు" అంటారు. ఈ మూడు పదార్థాలు వైద్యంలో చాలా మంచి పాత్రను పోషిస్తాయి. ఈ మూడింటి ఉపయోగం వల్ల ఎన్నో రకాల స్వల్ప వ్యాధులు నయమౌతాయి అని దాదాపు ప్రతి భారతీయుడికి తెలుసు. ఈ సంచికలో ఈ త్రికటకాలను ఉపయోగించిన ఆరోగ్య చిట్కాలను గురించి తెలుసుకుందాం.

**శొంఠి :** దీనికి శోధించే గుణముంది. అంటే శరీరంలో రోగం ఎక్కడుందో వెతికి కనిపెడుతుంది. కానీ ఇది పంటగా లభించదు, దీన్ని అల్లంతో తయారు చేసుకోవాలి.

**శొంఠి తయారు చేసుకునే విధానము :** శొంఠి తయారు చేసుకోవాలి అనుకునేవారు వారికి అవసరమైనంత అల్లం తీసుకుని పైపొట్టు తీసివేసి, పాలల్లో బాగా ఉడకబెట్టిన తర్వాత వాటిని సున్నం తేటలో కొద్దిసేపు నానబెట్టి, వాటిని బాగా ఎండబెడితే అది శొంఠి అవుతుంది. మార్కెట్‌లో లభించే శొంఠి మంచిదో, కాదో అన్న అనుమానం వున్నవారు శొంఠిని స్వయంగా చేసుకుంటే నమ్మకంగా, రుచిగా వుంటుంది.

**మిరియం :** రక్త శుద్ధి చేయగలది. కాబట్టి నాటి నుండి నేటి వరకు మిరియాలకు ఆహార పదార్థాల్లో ప్రత్యేకమైన స్థానం వుంది. మిరియం మనం తిన్న ఆహారాన్ని ఫిల్టర్ చేసి, వృథాలను మలం వైపుకు, మంచి పదార్థాన్ని శరీరానికి అందేలా చేస్తుంది. మెదడులోని నరాల (రూస్టర్స్) మధ్య పెరిగిన కొవ్వును తగ్గించే గుణం మిరియాలకు తప్ప మరి వేటికీ లేదు. అంతటి దివ్యమైన ఔషధం మిరియం.

**పిప్పళ్ళు :** రోగ నిరోధక శక్తిని పెంచే గుణం కలవి.

**ఉమామహేశ్వర రావు, మణుగూరు, భద్రాచలం-కొత్తగూడెం జిల్లా:**

ఈ **'త్రికటకాలు'** లో ఔషధ గుణాలను గమనించిన మన పూర్వీకులు వీటిని చాలా తినుబండారాల్లో కలిపేవారు. కాలక్రమంలో వీటి ప్రాముఖ్యతను తెలుసుకోలేక, వీటి వాడకం తగ్గిపోయింది.

**జలుబు, దగ్గు, ఆయాసం నివారణకు త్రికటకాలు :**

త్రికటకాలు మూడింటిని పొడిగా చేసుకుని ఒక డబ్బాలో వేసుకుని ప్రతిరోజూ తేనెతోకాని, పాలతోకాని తీసుకున్నట్ల యితే జలుబు, దగ్గు, ఆయాసం తగ్గుముఖం పడతాయి.

**పైత్యం, జలుబు, దగ్గు, ఆయాసం, గొంతు నస లకు ఔషధం :**

చిన్న శొంఠి ముక్కకు కొద్దిగా తడి చేసి ఉప్పును పట్టించాలి. ఆ తర్వాత దాన్ని పెనంమీద వేయించి, దాన్ని పొడిగా చేసుకుని, ఆ పొడిని ప్రతి రోజు ఉదయం సాయంత్రం మూడు రోజుల పాటు తేనె లేదా నెయ్యి లేదా నిమ్మరసంతో కలిపి తీసుకుంటే పై రోగాలన్నీ తగ్గుముఖం పడతాయి.

**దీర్ఘకాల తలనొప్పి తగ్గటానికి చిట్కా:**

శొంఠి, బెల్లం కలిపి దంచి ముద్దగా చేసి ఒక చిన్న గుడ్డలో వాటిని పెట్టి ముక్కుదగ్గర పెట్టుకుని వాసన చూసినట్లయితే ఎన్నో రోజుల నుండి ఉన్న తలనొప్పి కూడా తగ్గిపోతుంది. ఈ రెండు కలిపితే అంతటి వైద్య గుణం వెలువడుతుందన్నమాట.

**బాలింతలకు పాలు పడకపోతే ఔషధం :**

శొంఠి, కొద్దిగా ఇంగువ, కొద్దిగా సైంధవ లవణం కలిపి మెత్తగా నూరి రోజుకు రెండుసార్లు చొప్పున ఒక చెంచాడు తీసుకున్నట్లయితే పాలు పడని బాలింతలకు వెంటనే పాలు పడతాయి.

**బాలింత జబ్బుల నుండి రక్షణకు, పాలు పడటానికి చిట్కా:**

శొంఠిని నేతిలోగాని, తేనెలోగాని వేయించి, పొడి చేసుకుని ఆ పొడిని పాలల్లో కలుపుకుని తాగినట్లయితే కూడా బాలింతలకు పాలు పడతాయి అంతే కాక 'బాలింత జబ్బు' లు రావు. బాలింతలు ఆహార నియమాల్లో కాని, వేడి చేసుకోవటం, చెవులలో గాలి చొరబడినట్లయితే, సరియైన జాగ్రత్త చర్యలు తీసుకోనట్లయితే కాన్పు అయిన 6 నెలల లోపు 'బాలింత జబ్బు'లకు గురయ్యే ప్రమాదముంటుంది. ఇటువంటి ప్రమాదం నుండి గట్టెక్కిస్తుంది ఈ చిట్కా.

**దాహార్తి తీరటానికి, ఆహారం అరగటానికి పానకం :**

బెల్లం, మిరియాలు కలిపి మెత్తగా నూరి నీటిలో కలిపి శ్రీరామ నవమికి 'పానకం' చేస్తూ వుంటారు. దానికి కారణం ఈ పండుగ మంచి వేసవి కాలంలో వస్తుంది, ఎన్ని నీళ్ళు త్రాగినా దాహం తీరదు. ఆ సమయంలో ఈ పానకం త్రాగినట్లయితే నాలుగైదు గంటల పాటు దాహం బాధ వుండదు. అంతే కాదు ఎక్కువ సేపు ఆకలి కాకుండా కూడా నిలువరిస్తుంది, తిన్న ఆహారం త్వరగా, బాగా జీర్ణమవుతుంది.

మిరియాలు, ఉప్పు కలిపి పొడి చేసుకుని నీటిలో వేసుకుని నోట్లో వేసుకుని పుక్కిలించినట్లయితే పంటి సంబంధ జబ్బులు రావు. పండ్ల చిగుర్లు కూడా గట్టిపడతాయి.

మిరియాలు, బాదం పప్పు కలిపి మెత్తగా నూరుకుని రోజుకు రెండుసార్లు తేనె లేదా నిమ్మరసం లేదా నీటితోనైనా సరే తీసుకున్నట్లయితే కండరాల నొప్పులు దరిచేరవు.

**తలలో చుండ్రు నివారణకు :**

మిరియాలు, వేపాకు కలిపి మెత్తగా నూరి, తలకు పట్టించుకుని ఒక గంట తర్వాత స్నానం చేసినట్లయితే చుండ్రు బాధ వుండదు.

**శరీరంపై దురదలు, ఎలర్జీ తగ్గటానికి :**

కొద్దిగా మిరియాలు, వేపాకు, ఉప్పు, పసుపులను కలిపి మెత్తగా నూరుకుని శరీరానికి పట్టించుకుని ఒక గంట తర్వాత స్నానం చేసినట్లయితే దురదలు నశిస్తాయి. స్నానం చేసేటప్పుడు కూడా ఇదే పేస్టును సబ్బులా రుద్దుకోవాలి తప్ప సబ్బు వాడరాదు. ఇలా చేస్తే భయంకరమైన దురదలు కాని, అలర్జీలు కాని దరిచేరవు.

**పిప్పళ్ళు :**

వీటిని ఇతర పదార్థాలతో కలిపి వాడాలే తప్ప, విడిగా వాడటం మంచిది కాదు. పిప్పళ్ళలో కాల్షియం, ఇనుము, విటమిన్లు సమృద్ధిగా వుంటాయి. డ్రై ఫ్రూట్స్‌లో ఎండు ఖర్జూరాలు ఎంతటి ప్రాముఖ్యమైనవో, సుగంధ ద్రవ్యాలలో పిప్పళ్ళు అంతటి ప్రాముఖ్యమైనవి.

**గర్భిణీ స్త్రీల చిరు జబ్బులకు చిట్కా :**

గర్భిణీ స్త్రీలు నాలుగు పిప్పళ్ళను మెత్తగా నూరుకుని తేనెతో కలిపి తీసుకున్నట్లయితే వాంతులు, జ్వరం, విరేచనాలు, తలనొప్పి లాంటి ఎటువంటి చిన్నపాటి అసౌకర్యాలలన్నిటిని తొలగిపోతాయి.

**నోటి జబ్బులకు ఔషధం :**

పిప్పళ్ళు, శొంటి, మిరియాలు, యాలకులు, లవంగాలు, సైంధవ లవణం, కొద్దిగా నల్లతుమ్మ చెక్క వీటన్నిటిని కలిపి మెత్తగా నూరుకుని ఆ పొడితో పళ్ళు తోముకున్నట్లయితే ఊడిపోవటానికి సిద్ధంగా వున్న పళ్ళయినా సరే ఒకటి రెండు గంటల్లో గట్టిపడతాయి. చిగుళ్ళలోంచి రక్తం కారటం ఆగిపోతుంది. నోటి దుర్వాసన కలిగిన వారు పదిహేను రోజుల పాటు ఈ పొడితో పళ్ళు తోముకున్నట్లయితే దుర్వాసన నివారించ బడుతుంది. పండ్లల్లో వున్న ఎటువంటి క్రిములనైనా సరే నశింప జేస్తుంది ఈ పొడి.

**అబ్దుల్ కరీం, ఆత్మకూరు, కర్నూలు జిల్లా :**

**ఊబ కాయం, థైరాయిడ్ తగ్గటానికి ఔషధం :**

త్రికటకాలు, యావ క్షారము 50 గ్రాముల చొప్పున తీసుకుని మెత్తటి పొడి చేసుకుని ఆ మిశ్రమంలో 30 గ్రా. లోహ భస్మముల పొడిని ఒక స్పూను తీసుకుని, త్రిఫల కషాయంలో కలుపుకుని నాలుగు మాసాలు తీసుకున్నట్లయితే ఊబ కాయం, థైరాయిడ్ తప్పకుండా తగ్గిపోతుంది. రక్త హీనత వున్న వారికి కూడా చాలా బాగా పని చేస్తుంది. ఈ మిశ్రమాన్ని 'శోదరి లోహం' అంటారు.

**తలనొప్పి తగ్గటానికి :**

శొంఠిని గంధం లాగా అరగదీసుకుని తలకు పట్టించుకున్నట్లయితే ఎటువంటి తలనొప్పయినా సరే తగ్గి పోతుంది. ఈ గంధాన్ని కొద్దిగా ముక్కులోకి పట్టించినట్లయితే తుమ్ములు బాగా వస్తాయి. తుమ్ములు రావటం వల్ల ముక్కుల్లోని దుమ్ము, ధూళి కణాలు బయటకు వెళ్ళి శ్వాస బాగా ఆడుతుంది.

**గొంతులో కఫం, అజీర్తి తగ్గటానికి :**

శొంఠి పొడిని పాలలో వేసుకుని టీలాగా చేసుకుని తాగినట్లయితే గొంతులోని కఫం తగ్గిపోతుంది. అజీర్తి రోగాలు కూడా తగ్గిపోతాయి.

**బాలింతల ఆరోగ్యానికి శొంఠి లేహ్యము :**

శొంఠి, వాములను బాగా దంచి మెత్తటి పొడిగా చేసుకుని, బెల్లం పాకంలో కలిపి రోజుకు ఒక స్పూను లేహ్యాన్ని తీసుకున్నట్లయితే బాలింతలకు చాలా రోగాలు దరి చేరవు.

గమనిక : ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

**ఉమామహేశ్వర రావు : 94402 86854**

**అబ్దుల్ కరీం : 85004 91978**

# స్పందన

రాఘవరెడ్డి గారూ,

నేను జనవరిలో రామకష్ణ మఠంలో జరిగిన 'దేశీ విత్తనోత్పత్తి–2018'లో 'పల్లెసృజన' స్టాల్‌ను వెతికి మరీ పత్రికకు చందా కట్టడం జరిగింది. పల్లెసృజన పేరును మా మిత్రుల ద్వారా విని ఈ పత్రికను తప్పకుండా తెప్పించుకోవాలి అనుకోవటానికి కారణం మా నానమ్మకు పుస్తకాలు చదివే అలవాటు ఎక్కువ. చందా కట్టిన సమయంలో మీరు ఇచ్చిన పుస్తకాలను, మీరు పోస్టు ద్వారా పంపిన 60వ సంచికను చదివిన మా నానమ్మ నాతో ఈ పుస్తకం తప్పకుండా చదువరా, చాలా బాగుంది అనటంతో పత్రికను ఆసాంతం చదవటం జరిగింది. 12 సంవత్సరాలుగా ఎటువంటి ప్రచార ఆర్భాటం లేకుండా ఇంతటి సేవలందిస్తున్న మీ సభ్యుల మనోభావాలను చదివిన తర్వాత నేను 'పల్లెసృజన'కు పెద్ద ఫ్యాన్‌గా మారానటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. మిమ్మల్ని గురించి చదవటం కాదు, ప్రత్యక్షంగా కలుసుకుని నా మనోభావాలు పంచుకోవాలి అనుకుంటున్నాను. వృత్తిరీత్యా లాయర్‌ను అయిన నేను వ్యవసాయం కూడా చేయిస్తున్నాను. మీరు అందిస్తున్న ఖర్చు తగ్గించేలా చేసే వ్యవసాయ సూచనలు, తక్కువ ఖరీదులో లభించే వ్యవసాయ పరికరాలు నన్నెంతో సంతోషానికి గురి చేశాయి. మీ కొరకు నేను అందించ గల సేవలేమైనా వుంటే నిరభ్యంతరకరంగా చెప్పవలసిందిగా కోరుతున్నాను. 'పల్లెసృజన' నిర్వాహకులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

**– మధు యాదవ్, అడ్వకేట్,** రాంనగర్, హైదరాబాద్.

మధు యాదవ్ గారికి,

మీ అభిమానం మమ్మల్ని ఇంకా ద్విగుణీకృత ఉత్సాహంతో పనిచేసేలా ప్రేరేపించిందని ఆనందంగా తెలియజేస్తున్నాము. మీలాంటి వాళ్ళ అభిమానం వల్లనే 'పల్లెసృజన' ఇంతటి ప్రజాదరణ పొందింది. మీరు అందించే సేవల్లా వీలైనంత వరకు మీ మిత్రులతో చెప్పి ఈ పత్రికను వారి వారి గ్రామాలకు వెళ్ళే ఏర్పాటు చేయించండి. దానివల్ల కొత్త కొత్త ఇన్నోవేషన్లు గ్రామ ప్రజలకు తెలియటంతో పాటు, అందుబాటులో వున్న ఇన్నోవేషన్లను వారు కూడా కొనుగోలు చేసి, వారి జ్ఞానాన్ని మాతో పంచుకునే అవకాశం లభిస్తుంది. దేశీయ జ్ఞానానికి పెద్దపీట వేసినట్లవుతుంది. ధన్యవాదములతో......

**– మీ పి.వి. రాఘవ రెడ్డి.**


## FORM IV

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA) to be published in the first issue every year after the last day of February***

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,** Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Teelangana |
| 2. Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. Printer's Name | : | **P. Ganesham** |
| Nationality | : | Indian |
| Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 4. Publisher's Name | : | **P. Ganesham** |
| Nationality | : | **Indian** |
| Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. Editor's Name | : | **J. Seshi Mohan** |
| Nationality | : | **Indian** |
| Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**

## ఒక గ్రామ రైతుల చింతను తీర్చిన చంద్రశేఖర్ సేంద్రియంగా తయారు చేసిన

# నులిపురుగుల (నిమటోడ్స్) నివారణ మందు




గుంటూరు జిల్లా, బాపట్ల, దరివాద కొత్తపాలెం గ్రామానికి చెందిన రైతుబిడ్డ కనకారెడ్డి ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. తన గ్రామంలో చాలామంది రైతులు 'లైనాకు' అనే క్రోటన్ మొక్కల పెంపకం చేస్తూవుంటారు. ఈ ఆకును పెళ్ళిల్లు, శుభకార్యాలలో వేదికలపైన చేసే పూల డెకరేషన్లలో విరివిగా వాడుతారు. ఈ మొక్కలు పొలంలో ఒకసారి నాటినతర్వాత మూడు నుండి నాలుగు సంవత్సరాల వరకు వుంటుంది. ప్రతి నాలుగు మాసాలకోసారి ఆకులు, కొమ్మలను కోసి అమ్ముకోవటమే తప్ప పంట మార్పిడి, విత్తనం వేయటం అవసరం లేకపోవటం, మార్కెట్‌లో కూడా మంచి గిరాకీ వుండటంతో ఆ గ్రామ రైతులు చాలామంది ఈ 'లైనాకు'ను సాగు చేస్తున్నారు. గతంలో 'మరువం', 'దమణం' అనే ఆకులను కూడా సాగు చేసేవారు. ఈ ఆకులు మంచి ఆదాయాన్నిచ్చేవే, అయితే అవి ఎక్కువ రోజులు నిలువ వుండక పోవటం వల్ల రైతులంతా లైనాకు సాగులోకి మారిపోయారు. మార్కెట్‌లో కూడా ఇప్పుడు మరువం, దమణం ఆకుల బదులు కిలో 10 రూపాయలకే లభించే 'లైనాకు'నే ఎక్కువగా వినియోగిస్తుండటంతో వీరు ఈ పంట వేయటానికి మొగ్గు చూపారు.

ఈ లైనాకు దీర్ఘ కాల పంట కావటం వల్ల, పంట మార్పిడి లేకపోవటంతో 'నిమటోడ్స్' సమస్య తలెత్తి చెట్లన్నీ ఎండిపోవటం మొదలు పెట్టాయి. వీటికి మార్కెట్‌లో లభించే మందులను తెచ్చి పిచికారి చేసినా పెద్దగా ఫలితం లేకపోయేది, పైగా ఎకరాకు దాదాపు నెలకు 5 నుండి 6 వేల దాకా క్రిమి సంహారక మందులకే ఖర్చయ్యేది. 40 రోజులకోసారి కోత కోసినప్పుడల్లా నిమటోడ్స్ సోకిన చెట్ల ప్రక్కనున్న చెట్లకు కూడా ఇది ప్రాకిపోవడంతో ఆ మొక్కలు ఎదుగుదల లేకుండా వుండిపోయేవి. దాంతో ఎకరాకు 9 టన్నుల వరకు వచ్చే దిగుబడి ఈ నిమటోడ్స్ వ్యాధితో 6 టన్నులకు పడిపోయింది. ఆ విధంగా రైతులు నష్టాలు చవిచూస్తున్న సమయంలో 'పల్లెసృజన' ఇన్నోవేటర్ గల్లా చంద్రశేఖర్ తయారు చేసిన సహజసిద్ధ 'నిమటోడ్స్' నివారణ మందును గురించి తెలుసుకుని, ఈ మందు తన గ్రామంలోని రైతులను ఆదుకుంటుందన్న ఆశతో ఆయనతో సంప్రదించాడు కనకారెడ్డి. వీరి బాధను తెలుసుకున్న చంద్రశేఖర్ మీకు ముందుగా కొంత మందును పంపుతాను దాన్ని వాడి చూడండి, మీ మొక్కలు ఈ మందుతో బాగైతే కావాల్సినంత పంపుతాను అని కొంత మందును పంపటం జరిగింది. దాన్ని గ్రామంలోని ఇద్దరు రైతులకు ఇచ్చి దీన్ని వాడి చూడండి, ఫలితం ఎలావుందో చెప్తే నేను ఈ మందు తెప్పిస్తానన్నాడు. దాన్ని వాడిన 20 రోజుల్లోనే 'నిమటోడ్స్' వ్యాధి సోకిన చెట్లకు కొత్తవేర్లు వచ్చి మళ్లీ పచ్చదనం సంతరించుకోవటంతో దిగుబడి 9.3 టన్నులకు చేరుకోగా ఆ రైతులు ఎంతో ఆనందానికి గురయ్యారు. వెంటనే కనకారెడ్డి ద్వారా ఈ మందును ఆ గ్రామంలోని రైతులంతా 'నిమటోడ్స్' వ్యాధి వల్ల తమకింక భయం లేదన్నట్లుగా వున్నారు. ఈ మందును ఇసుకలో కలుపుకుని, చెట్టు వేర్ల వద్ద వేసి చెట్లకు నీరు అందిస్తే చాలు వేరు వ్యవస్థ వద్దకు వెళ్ళి కుళ్ళిన వేరు ప్రాంతంలోకి వెళ్ళి నులిపురుగులను నశింపజేసి, కొత్త వేర్లు వచ్చేలా చేసింది.

దరివాడ కొత్తపాలెం గ్రామ రైతుల సమస్యలు తీర్చిన చంద్రశేఖర్, కనకారెడ్డిలను ఆ గ్రామంలోని 'లైనాకు' పంట వేసిన 200 ఎకరాల రైతులంతా ఎంతో అభిమానంగా చూస్తున్నారు. కనకారెడ్డి ఈ 'నిమటోడ్స్' మందును తమ గ్రామ రైతులంతా వినియోగించుకునేలా త్వరలో ఒక 'రైతు శిబిరం' ఏర్పాటు చేసి రైతులకు ఈ మందు విశిష్ఠతను తెలపాలనుకుంటున్నట్లు తెలియజేశాడు.

ఎన్నో గ్రామాల్లో రకరకాల పంటల వేరు వ్యవస్థను దెబ్బతిని, నిట్టనిలువుగా ఎండిపోతున్నాయి. దానకి కారణం ఈ నులి పురుగులు (నిమటోడ్స్). విపరీతంగా నష్టపరిచే వీటి బెంగను తీర్చిన ఈ సేంద్రియ పురుగు మందును బాధిత రైతులు వినియోగించుకుని నిశ్చింతగా ఉండాలన్న ఉద్దేశ్యంతో ఈ కథనాన్ని మీకందిస్తోంది 'పల్లెసృజన'. వివరాలకు **కనకారెడ్డిని సంప్రదించాల్సిన ఫోన్ నెం. : 80089 82347.**

కావాల్సిన వారు సంప్రదించండి :

**బి. సుభాష్ చందర్,** ఎజిఎం., క్రియేటివ్ మైండ్స్,
ప్లాట్ నెం. 67, రోడ్ నెం.2, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ – 500 094.
**Ph. : 040-27111959, 9652801700**
mails : creativemindsap@gmail.com, boddu.subhash4@gmail.com

PALLESRUJANA Telugu Bi-monthly March-April 2018 RNI No. TELTEL 2012/74620


# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే



**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 350/- | 1,400/- |
| ఐదు సంవత్సరాలకి (నాలుగు పాత సంచికలు ఉచితం) | 800/- | 3,200/- |

పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 8125799904, 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.
మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

**M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023**


Narendra Grafix, Hyd. Ph.: 81257 99904